'పేపర్ లీక్‌లు కావడం కాంగ్రెస్ హయాంలో అతి సాధారణమైన విషయం' అని వ్యాసకర్త వ్యాఖ్యానించారు. కానీ గణాంకాలు దానికి వ్యతిరేకంగా ఉన్నాయి. 2015కు ముందు నమోదైన కేసుల్లో కేవలం 12 కేసుల్లోనే సీబీఐ శిక్ష వేయించగలిగింది. కానీ, 2015 తర్వాత 148 కేసులలో కేవలం ఒక్క కేసులోనే నేరం రుజువై శిక్ష పడింది. అది కూడా చండీగఢ్‌లోనే. సీబీఐకి 2015 తర్వాత కనీసం 17 కేసులు దర్యాప్తునకు అప్పగించారు. అందులో శిక్ష నమోదు రికార్డు సున్నా! అదే సమయంలో 11 కేసులలో ఈడీ పనితీరు శూన్యం. ప్రస్తుత ప్రభుత్వ పాలనలో జవాబుదారీతనం కుప్పకూలిపోయింది. అంచెల కుల సమాజంలో పరీక్ష వ్యవస్థలకు ఉండే సమానత్వ సామర్థ్యం దెబ్బతిని, సాధికారతే ప్రశ్నార్థకం అయింది.

యూజీసీ నెట్–2024 పేపర్ లీక్ ఘటనలో నేను కూడా బాధితుడినే. ఈ ఏడాది కూడా ప్రశ్న పత్రంలో అక్షరదోషాల వల్ల మూడు పేపర్లను రద్దు చేశారు. ఇంతటి తీవ్ర సంక్షోభానికి సమాధానం అడగవలిసిన వ్యవస్థలు ఈ దేశ విద్యార్థులకు నిరాశను మిగల్చడమే కాక 'బొద్దింకలు' అని అవమానపరిచాయి. దిగజారిన రాజ్యాంగ, ప్రజాస్వామిక విలువలను, జవాబుదారీతనాన్ని తట్టి లేపి, తిరిగి తన న్యాయమైన స్థానంలో పునరుద్ధరించడం కోసమే ఈ ఉద్యమం. ఎంత దాడి జరిగినా విద్యార్థి ఉద్యమం మాత్రం సమాజాన్ని మానవీకరించే దిశగా, వ్యవస్థలను ప్రజాస్వామీకరించి కాపాడుకునే దిశగానే సాగుతుంది.

○ పి. ఆనంద్
పీహెచ్‌డీ విద్యార్థి, పుదుచ్చేరి

వెయ్యి రోజుల ప్రజాపాలన!

తెలంగాణ ప్రజల ఆకాంక్షలు, ఆశయాలు, ఆత్మగౌరవాన్ని పాలనకు కేంద్రబిందువుగా చేసుకుని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనను విజయవంతంగా పూర్తి చేసుకుంది. ఈ వెయ్యి రోజులు కేవలం క్యాలెండర్లో గడిచిన రోజులు కావు. తెలంగాణ భవిష్యత్తుకు దిశానిర్దేశం చేసిన నిర్ణయాల కాలం.

యువతకు ఉద్యోగాలు, రైతుకు భరోసా, మహిళలకు ఆర్థిక స్వావలంబన, పేదలకు గౌరవప్రదమైన జీవనం, రాష్ట్రానికి భారీ పెట్టుబడులు– ఇవన్నీ సమన్వయంతో ముందుకు తీసుకెళ్లాలన్నదే ప్రజా ప్రభుత్వ లక్ష్యం. ప్రభుత్వం ఏర్పడిన కొద్ది గంటల్లోనే అమలు చేసిన మహాలక్ష్మి పథకం ఇందుకు నిదర్శనం.

ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించడం ద్వారా కోట్లాది మంది మహిళలకు ఆర్థిక ఉపశమనం లభించింది. ఇప్పటి వరకు 345 కోట్లకు పైగా ఉచిత ప్రయాణాలు జరిగి, మహిళలు సుమారు రూ.12,075 కోట్ల ప్రయాణ వ్యయాన్ని ఆదా చేసుకున్నారు. ఈ పథకం విజయవంతం కావడంతో పెరిగిన ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా తెలంగాణ ఆర్టీసీని బలోపేతం చేయడంపై ప్రజా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టింది. కొత్త బస్సుల కొనుగోలు, ఆధునిక బస్ స్టేషన్ల నిర్మాణం, కొత్త డిపోల ఏర్పాటు, ఉద్యోగ నియామకాలు, ఉద్యోగుల సంక్షేమం వంటి అనేక చర్యలతో ఆర్టీసీని ప్రజలకు నమ్మకమైన ప్రజా రవాణా సంస్థగా తీర్చిదిద్దింది. ఆర్టీసీ ఉద్యోగుల సంక్షేమంలోనూ ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంది. 2013 నుంచి పెండింగులో ఉన్న రూ.280కోట్ల బాండ్లను క్లియర్ చేయడం; 2017, 2021 పే స్కేల్ సమస్యలను పరిష్కరించడం; 11వ పీఆర్సీ అమలు; పెండింగులో ఉన్న డీఏల విడుదల; పీఎఫ్, సీసీఎస్ బకాయిల తగ్గింపు వంటి చర్యలు ఉద్యోగుల్లో నూతన విశ్వాసాన్ని నింపాయి.

తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు రైతు వెన్నెముక. ప్రజా ప్రభుత్వం రూ.2 లక్షల వరకు పంట రుణాలను మాఫీ చేసి 25 లక్షలకు పైగా రైతు కుటుంబాలను రుణభారం నుంచి విముక్తి చేసింది. రైతు భరోసా కింద రూ.36వేల కోట్లకు పైగా పెట్టుబడి సాయం అందించింది. సన్నవడ్లకు క్వింటాలుకు రూ.500 బోనస్, ఉచిత విద్యుత్, రైతు బీమా, పంట నష్ట పరిహారం వంటి కార్యక్రమాలతో రైతుకు ప్రభుత్వం అండగా నిలిచింది. ధాన్యం కొనుగోళ్లలోనూ తెలంగాణ కొత్త రికార్డులు సృష్టించింది.

సంక్షేమం అంటే కేవలం ఆర్థిక సహాయం మాత్రమే కాదు; ఒక కుటుంబానికి విద్యుత్ భారం తగ్గించడం, వంటగ్యాస్ ఖర్చును తగ్గించడం, నాణ్యమైన బియ్యం అందించడం, ఇల్లు నిర్మించుకునే అవకాశం కల్పించడం– ఇవన్నీ కుటుంబ జీవన ప్రమాణాలను మెరుగుపరిచే చర్యలే. ప్రభుత్వం గృహజ్యోతి ద్వారా 53 లక్షలకు పైగా కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇచ్చింది. దాదాపు 43 లక్షల కుటుంబాలకు రూ.500కే గ్యాస్ సిలిండర్ అందుతోంది. 15 లక్షలకు పైగా కొత్త రేషన్ కార్డులను జారీ చేసి, మరింత మందిని ఆహార భద్రత పరిధిలోకి తీసుకువచ్చింది. రేషన్ కార్డుదారులకు నాణ్యమైన సన్నబియ్యం అందించే కొత్త విధానానికి శ్రీకారం చుట్టింది. ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా అర్హులైన పేదలకు సొంత ఇంటి కలను నిజం చేసే దిశగా అడుగులు వేస్తున్నది.

మహిళలను కేవలం సంక్షేమ పథకాల లబ్ధిదారులుగా కాకుండా ఆర్థిక వ్యవస్థలో భాగస్వాములుగా చేసేందుకు స్వయం సహాయక సంఘాలకు భారీగా బ్యాంకు లింకేజీ కల్పించడం; వడ్డీ రాయితీలు ఇవ్వడం; పాఠశాల యూనిఫాంలు, చీరల తయారీ, పెట్రోల్ బంకుల నిర్వహణ, ఆర్టీసీ బస్సుల యాజమాన్యం వంటి కొత్త ఆదాయ మార్గాలను ప్రభుత్వం కల్పించింది.

> **వెయ్యి రోజుల ప్రజాపాలన ఒక మైలురాయి మాత్రమే. తెలంగాణను మరింత బలమైన, సమానత్వంతో కూడిన, పెట్టుబడులకు అనుకూలమైన, ఉపాధి అవకాశాలు కలిగిన, పర్యావరణహితమైన, ప్రపంచస్థాయి రాష్ట్రంగా తీర్చిదిద్దే ప్రయాణంలో ఇది ఒక కీలక దశ.**



సామాజిక న్యాయం కోసం రాష్ట్రవ్యాప్తంగా సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వేను పూర్తి చేసింది ప్రజాప్రభుత్వం. బీసీలకు విద్య, ఉద్యోగాలు, రాజకీయాల్లో 42శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లులను శాసనసభ ఆమోదించి కేంద్రానికి పంపింది. ఎస్సీ ఉపకులాల వర్గీకరణను అమలు చేయడం ద్వారా సామాజిక న్యాయంలో కొత్త అధ్యాయాన్ని ప్రారంభించింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమానికి రాష్ట్ర మొత్తం వ్యయంలో గణనీయమైన వాటాను కేటాయిస్తున్నది.

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడం, విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పోషకాహారం అందించడం, కొత్త రెసిడెన్షియల్ స్కూళ్లను ఏర్పాటు చేయడం, ఉపాధ్యాయ నియామకాలను చేపట్టడం ద్వారా విద్యారంగంలో సమగ్ర మార్పులకు ప్రజా ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. మెగా డీఎస్సీ ద్వారా 10,006 మంది ఉపాధ్యాయుల నియామకం జరిగింది.

యువత ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా 72 వేలకు పైగా ప్రభుత్వ ఉద్యోగ నియామకాలు చేపట్టింది ప్రభుత్వం. ఉద్యోగం కోసం ఎదురుచూస్తున్న యువతకు నైపుణ్యాభివృద్ధి ద్వారా కొత్త అవకాశాలను కల్పిస్తున్నది. యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, టాస్క్, టీ–హబ్, టీ–వర్క్స్, వీ–హబ్ వంటి సంస్థల ద్వారా వేలాది మంది యువతకు ఆధునిక నైపుణ్య శిక్షణ అందుతోంది.

తెలంగాణను పెట్టుబడుల అనుకూల రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం పారిశ్రామిక విధానాల్లో సంస్కరణలు చేపట్టింది. టీజీ–ఐపాస్ ద్వారా వేలాది పారిశ్రామిక యూనిట్లకు అనుమతులు ఇచ్చి భారీ పెట్టుబడులకు మార్గం సుగమం చేసింది. లైఫ్ సైన్సెస్, ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్లు, డేటా సెంటర్లు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, అడ్వాన్స్‌డ్ మాన్యుఫాక్చరింగ్ వంటి భవిష్యత్ రంగాల్లో తెలంగాణను జాతీయ, అంతర్జాతీయ పెట్టుబడులకు కేంద్రంగా అభివృద్ధి చేస్తున్నది.

ప్రజా ప్రభుత్వం కేవలం ప్రస్తుత సమస్యలకు పరిష్కారాలు చూపడం మాత్రమే కాదు; వచ్చే తరాల తెలంగాణను నిర్మించేందుకు దీర్ఘకాలిక లక్ష్యాలను నిర్దేశించింది. తెలంగాణ రైజింగ్–2047లో భాగంగా 2034 నాటికి ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణను తీర్చిదిద్దే లక్ష్యాన్ని నిర్దేశించుకున్నది.

వెయ్యి రోజుల ప్రజాపాలన ఒక మైలురాయి మాత్రమే. తెలంగాణను మరింత బలమైన, సమానత్వంతో కూడిన, పెట్టుబడులకు అనుకూలమైన, ఉపాధి అవకాశాలు కలిగిన, పర్యావరణహితమైన, ప్రపంచస్థాయి రాష్ట్రంగా తీర్చిదిద్దే ప్రయాణంలో ఇది ఒక కీలక దశ. రైతు ముఖంలో చిరునవ్వు, మహిళ చేతిలో ఆర్థిక స్వావలంబన, యువతకు ఉద్యోగం, విద్యార్థికి నాణ్యమైన విద్య, పేదవాడికి సొంత ఇల్లు, ప్రతి కుటుంబానికి ఆరోగ్య భద్రత, ప్రతి ప్రాంతానికి అభివృద్ధి – ఇదే ప్రజా పాలన లక్ష్యం.

● పొన్నం ప్రభాకర్
రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి

4న మద్దూర్‌కు సీఎం రాక

మద్దూర్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈనెల నాలుగున నారాయణపేట జిల్లా, మద్దూరుకు రానున్నారు. ఈ మేరకు మునిసిపల్ చైర్‌పర్సన్ సరస్వతీ జనార్దన్, పీఏసీఎస్ అధ్యక్షుడు నర్సింహా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మద్దూర్ పట్టణంలో జరుగుతున్న గురుకుల పాఠశాల, డిగ్రీ కళాశాల భవన నిర్మాణ పనులను పరిశీలించనున్నట్లు పేర్కొన్నారు. మునిసిపాలిటీలో ఏర్పాటు చేయాల్సిన సౌకర్యాలతో పాటు మండలంలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులను పరిశీలించనున్నట్లు తెలిపారు. అనంతరం అధికారులతో సమీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

ఉదయం పదిన్నర గంటల సమయంలో మక్తల్ ఎంపీడీవో కార్యాలయంలో ఖాళీ కుర్చీలు

భూత్పూర్ మండలంలో ప్రజావాణికి హాజరైన అధికారులు

వినిపించని... ప్రజావాణి

- మండలస్థాయి కార్యక్రమానికి స్పందన కరువు
- హాజరుకాని సగం మంది అధికారులు
- కొన్ని చోట్ల ఫిర్యాదుదారుల కోసం నిరీక్షణ
- మరికొన్ని చోట్ల అరకొర ఫిర్యాదులు, ఇంకొన్ని చోట్ల నిల్
- మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాల్లో 'ఆంధ్రజ్యోతి' విజిట్

ఆంధ్రజ్యోతి విజిట్

మహబూబ్‌నగర్/ నారాయణపేట, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : ఎక్కడి సమస్యలు అక్కడే పరిష్కరించాలని ప్రభుత్వం మండలస్థాయిలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమం మొక్కుబడిగా సాగింది. ప్రజల నుంచి స్పందన లేకపోవడంతో ఫిర్యాదులు అంతంత మాత్రంగానే వచ్చాయి. కొన్ని మండల కేంద్రాల్లో ఫిర్యాదుదారుల కోసం అధికారులు నిరీక్షించడం కనిపించింది. కొన్ని మండలాల్లో అరకొర ఫిర్యాదులు అందాయి. మరికొన్ని మండలాల్లో ఒక్క ఫిర్యాదు కూడా రాలేదు. కార్యక్రమానికి సగం మంది అధికారులు డుమ్మా కొట్టారు. కీలకశాఖల అధికారులు రాలేదు. మరికొన్ని చోట్ల వచ్చినా.. సమయపాలన పాటించలేదు. మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాల్లో సోమవారం నిర్వహించిన మండలస్థాయి ప్రజావాణి కార్యక్రమాన్ని 'ఆంధ్రజ్యోతి' విజిట్ చేసింది. వివరాలు..

గండీడ్‌లో నిర్వహించిన ప్రజావాణిలో ఫిర్యాదుదారుల కోసం నిరీక్షిస్తున్న అధికారులు

- మిడ్జిల్ మండలంలో నిర్వహించిన ప్రజావాణికి కీలక శాఖలకు సంబంధించిన అధికారులు హాజరుకాలేదు. ఒక్క ఫిర్యాదు కూడా రాకపోవడంతో వచ్చిన అధికారులు కూడా గంటల తరబడి ఎదురుచూసి వెళ్లిపోయారు. సీసీకుంట మండలంలోనే అత్యధికంగా ప్రజావాణికి పది పిర్యాదులు వచ్చాయి.
- దేవరకద్రలో మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఒక్క ఫిర్యాదు కూడా రాలేదు. గండీడ్ మండలంలో ఉదయం 11:10 గంటల వరకు అధికారులు రాలేదు. తరువాత ఎంపీడీవో, తహసీల్దార్, పంచాయతీరాజ్ ఏఈ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్, వైద్య ఆరోగ్య శాఖకు సంబందించిన వారు మాత్రమే హాజరయ్యారు. రెండు ఫిర్యాదులు మాత్రమే వచ్చాయి. రాజాపూర్ మండల ప్రజావాణికి దాదాపు అన్ని శాఖలకు చెందిన అధికారులు హాజరయ్యారు.
- మహబూబ్‌నగర్ రూరల్ మండలంలో అధికారులు ఆలస్యంగా వచ్చారు. బాలానగర్‌లో నిర్వహించిన ప్రజావాణికి ఐదుగురు అధికారులు మాత్రమే హాజరయ్యారు. రెండు ఫిర్యాదులు వచ్చాయి. జడ్చర్లలో అన్ని శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు. భూత్పూర్‌లోని అదే పరిస్థితి నెలకొన్నది.
- నారాయణపేట ఎంపీడీవో కా ర్యాలయంలో 18 మంది అధికారులు హాజరయ్యారు. ఎంఈవో బాలాజీ కలెక్టర్ సమావేశంలో ఉండగా, ఐసీడీఎస్ అధికారి సెలవులో ఉన్నారు. ఏఈ పీఆర్ ఫీల్డ్‌వర్క్‌లో ఉన్నారు. అర్ అండ్ బీ ఇన్‌చార్జి అదనపు బాధ్యతల తో రాలేదు. ప్రజా స్పందన అంతంత మాత్రంగానే ఉంది.
- దామరగిద్ద ఎంపీడీవో కార్యాలయంలో ఉదయం 11 గంటల వరకు ఐదుగురు అధికారులు మాత్రమే హాజరయ్యారు. ఎంపీడీవో సాయిలక్ష్మితో పాటు ఐసీడీఎస్ సూపవర్‌వైజర్ రూప, పీఆర్‌ఏఈ రమేష్, వైద్యశాఖ అధికారి నారాయణ, ఏఈవో రవికుమార్, ఏపీవో జయమ్మ వచ్చారు. అప్పటివరకు ఒక్క దరఖాస్తు కూడా రాలేదు.
- కృష్ణ మండల కేంద్రంలో ప్రజావాణికి ఉదయం 11 గంటలకు ఎంపీడీవో కిషోర్‌కుమార్, ఎంఈవో నిజామోద్దీన్, పంచాయతీ కార్యదర్శులు మాత్రమే వచ్చారు. వ్యవసాయ, రెవెన్యూ శాఖల అధికారులు రాకపోవడంతో కొందరు ఫిర్యాదుదారులు వెనుదిరిగారు.
- మాగనూర్ ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో 11.30 గంటల తర్వాత కొందరు అధికారులు వచ్చారు. ఫిర్యాదుదారుల నుంచి స్పందన లేదు. గుండుమాల్ ఎంపీడీవో కార్యాలయంలో 10.59 గంటలకు ముగ్గురు అధికారులు మాత్రమే వచ్చారు. 11.07 గంటలకు ఎంపీడీవో ప్రజావాణికి హాజరయ్యారు. ఒక్క ఫిర్యాదు కూడా రాలేదు.
- కొత్తపల్లి మండలంలో 14 మంది అధికారులు ప్రజావాణికి హాజరయ్యారు. ఫిర్యాదుదారులు ఆసక్తి చూపలేదు.
- ధన్వాడ తహసీల్దార్ సింధూజ, ఎంపీవో వెంకటేశ్వర్‌రెడ్డి, డీటీ కాళప్పలు సర్ ప్రక్రియలో ఉన్నారు. ఎంపీవో ధన్వాడకు వచ్చి వెళ్లారు. ఇతర శాఖల అధికారులు ప్రజావాణికి హాజరయ్యారు. ప్రజల నుంచి ఏడు దరఖాస్తులు మాత్రమే వచ్చాయి.
- కోస్గి మండల కేంద్రంలో నిర్వహించిన ప్రజావాణికి ఎనిమిది మంది అధికారులు మాత్రమే హాజరుకాగా ఐదు దరఖాస్తులు వచ్చాయి. మద్దూర్ ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణికి 10.45 గంటల వరకు వివిధ శాఖలకు చెందిన 19 మంది అధికారులు వచ్చారు. మూడు ఫిర్యాదులు వచ్చాయి.

- మక్తల్ ప్రజావాణికి మునిసిపల్, విద్యుత్, విద్య, వైద్య, పశువైద్య, రెవెన్యూ వ్యవసాయ శాఖల అధికారులు అలస్యంగా వచ్చారు. ఇతర శాఖల అధికారులు రాకపోవడంతో ఫిర్యాదుదారులు వెళ్లిపోయారు.

- మరికల్ ఎంపీడీవో కార్యాలయంలో 10.45 గంటలకు ముగ్గురు హెల్త్, అంగన్‌వాడీ, విద్యుత్‌శాఖ అధికారులు మాత్రమే వచ్చారు. 11.00 ఎంపీడీవో పృథ్వీరాజ్ వచ్చారు. ఆ తర్వాత ఒక్కొక్కరుగా ఇతర అధికారులు కార్యాలయానికి చేరుకున్నారు. 11.43 ఎక్సైజ్ అధికారి వచ్చి, రికార్డులో సంతకాలు చేసి ఎంపీడీవో అనుమతితో వెళ్లిపోయారు. మొత్తం ఐదు ఫిర్యాదులు మాత్రమే వచ్చాయి.

- నర్వ ఎంపీడీవో కార్యాలయంలో 11.40 గంటల సమయానికి ఎనిమిది మంది అధికారులు హాజరయ్యారు. ఎంపీడీవో శ్రీనివాస్, తహసీల్దార్ మల్లారెడ్డి ఉన్నారు. రెండు ఫిర్యాదులు మాత్రమే వచ్చాయి. ఊట్కూర్‌లో నిర్వహించిన ప్రజావాణికి ఎనిమిది మంది అధికారులు హాజరయ్యారు.

పీఎంశ్రీ పాఠశాలలకు క్రీడా సామగ్రి

- కొనుగోలు కోసం నిధులు మంజూరు
- నారాయణపేట జిల్లాకు రూ.9.50 లక్షలు
- ఉమ్మడి పాలమూరు జిల్లాకు రూ. 57 లక్షలు

నారాయణపేట పీఎంశ్రీ మైదానంలో ఆడుకుంటున్న విద్యార్థులు

నారాయణపేట, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): పీఎంశ్రీ పాఠశాలల్లో క్రీడా సామగ్రి కొనుగోలుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. విద్యార్థులు చదువుతో పాటు క్రీడారంగంలో రాణించాలనే లక్ష్యంతో సర్వశిక్ష నుంచి నిధులు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రతీ పాఠశాలకు రూ.50 వేల ప్రకారం నిధులు మంజూరు చేసింది. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా ఉన్న 115 పీఎంశ్రీ పాఠశాలలకు రూ.57,50,000 మంజూరయ్యాయి. అందులో నారాయణపేట జిల్లాలోని 19 పాఠశాలలకు రూ.9.50 లక్షలు విడుదలయ్యాయి. డీఈవో గోవిందరాజులు ఆధ్వర్యంలో ఆయా పాఠశాలలకు క్రీడా సామగ్రి కొనుగోలు చేసేందుకు విద్యాశాఖాధికారులు చర్యలు తీసుకుంటున్నారు. క్రికెట్ కిట్, ఫుట్‌బాల్, వాలీబాల్, గ్రోబాల్, ఖోఖో సామగ్రి, కబడ్డీ, అథ్లెటిక్స్, చెస్, క్యారమ్‌బోర్డ్, టేబుల్ టెన్నిస్ తదితర క్రీడలకు అవసరమైన సామగ్రి కొనుగోలుకు ఈ టెండర్లు పిలువనున్నారు. కలెక్టర్ ఆమోదం అనంతరం ఆయా పాఠశాలలకు సామగ్రిని పంపించనున్నారు. గత ఏడాది క్రీడా నిధులు నేరుగా పీఎంశ్రీ పాఠశాలకు అందాయి. ఈ సారి మాత్రం డీఈవోలకు బాధ్యత అప్పగించారు.

జిల్లాల వారీగా నిధుల వివరాలు..

జిల్లాలు	పీఎంశ్రీ పాఠశాలలు	మంజూరైన నిధులు
మహబుబ్‌నగర్	26	13,00,000
నాగర్‌కర్నూల్	27	13,50,000
నారాయణపేట	19	9,50,000
జోగులాంబ గద్వాల	22	11,00,000
వనపర్తి	21	10,50,000
మొత్తం	115	57,50,000

నేరస్థులకు శిక్ష పడేలా దర్యాప్తు

- మల్టీజోన్ ఐజీ షానవాజ్ ఖాసీం ఆదేశం
- భూత్పూర్ సర్కిల్ కార్యాలయం తనిఖీ

భూత్పూర్ సీఐ కార్యాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న మల్టీజోన్ ఐజీ షానవాజ్ ఖాసీం

భూత్పూర్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి) : నేరస్థులకు శిక్ష పడేలా దర్యాప్తు అధికారులు సమర్థవంతంగా దర్యాప్తు చేయాలని మల్టీజోన్ ఐజీ షానవాజ్ ఖాసీం పోలీసు అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. మహబూబ్‌నగర్ జిల్లా, భూత్పూర్ సీఐ కార్యాలయాన్ని సోమవారం ఎస్పీ జానకితో కలిసి తనిఖీ చేశారు. వివిధ రికార్డులను పరిశీలించారు. కేసుల దర్యాప్తులో పురోగతి, పెండింగ్ కేసులు, నేరాల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలపై ఆరా తీశారు. పెండింగ్ కేసుల వివరాలు, వారెంట్లు, ఆన్‌లైన్ రికార్డులు, పోలీసులకు సంబంధించిన ఇతర రికార్డులను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. నేరాల నియంత్రణ, శాంతి భద్రతల పరిరక్షణ, కేసుల దర్యాప్తు నాణ్యతలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. అలాగే బీట్ పెట్రోలింగ్, రాత్రి సమయాల్లో గస్తీ, ప్రజలకు అవగాహన తదితర విషయాలను సీఐ రామకృష్ణతో మాట్లాడి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసుల దర్యాప్తులో సాక్ష్యాల సేకరణ, దర్యాప్తును వేగవతం చేయడం, కోర్టు ట్రయల్స్‌పై పర్యవేక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నారు. ఆయన వెంట డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ రామకృష్ణ, భూత్పూర్ సర్కిల్ పరిధిలోని ఎస్ఐలు, పోలీసు సి బ్బంది తదితరులు ఉన్నారు.

అత్యద్భుతంగా ఐదు రైల్వే స్టేషన్లు

మహబూబ్‌నగర్ రైల్వే స్టేషన్‌లో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ

- అమృత్ పథకం ద్వారా అభివృద్ధి పనులు
- కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జీ కిషన్‌రెడ్డి
- మహబూబ్‌నగర్, జడ్చర్ల రైల్వే స్టేషన్ల పరిశీలన

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లాలోని ఐదు రైల్వే స్టేషన్లను అమృత్ భారత్ పథకం ద్వారా అత్యద్భుతంగా తీర్చిదిద్దుతున్నట్లు కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జీ కిషన్‌రెడ్డి తెలిపారు. మహబూబ్‌నగర్, జడ్చర్ల రైల్వే స్టేషన్లను మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణతో కలిసి సోమవారం సందర్శించారు. అమృత్ భారత్ పథకంలో భాగంగా మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని రైల్వే స్టేషన్‌లో రూ. 44 కోట్ల వ్యయంతో జరుగుతున్న పనులను పరిశీలించారు. జడ్చర్ల రైల్వేస్టేషన్‌లో వెయిటింగ్‌హాళ్లు, ప్లాట్‌ఫాం నిర్మాణ పనులను పరిశీలించారు. శ్రీకాంత్ అనే యువకుడు ఏర్పాటు చేసిన తినుబండారాల స్టాల్‌ను తిలకించి, పల్లి చెక్కీలను కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పాలమూరు రైల్వేస్టేషన్ అభివృద్ధి పనులు వచ్చే ఏడాది మార్చి నాటికి పూర్తి చేయడమే లక్ష్యమన్నారు. హైదరాబాద్ నుంచి తిరుపతి, విశాఖపట్నం, నాగ్‌పూర్ వంటి నగరాలకు 5 వందే భారత్ రైళ్లను నడిపిస్తున్నట్లు తెలిపారు. హైస్పీడ్ రైల్ ఎలివేటెడ్ కారిడార్‌ను తీసుకొస్తున్నట్లు చెప్పారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే హైదరాబాద్ తదితర ప్రాంతాల నుంచి చెన్నై వంటి నగరాలకు చాలా వేగంగా చేరుకోవచ్చన్నారు. బుల్లెట్ రైలు వస్తే రాష్ట్రం అభివృద్ధి చెందుతుని, పరిశ్రమలు ఏర్పాటువుతాయని చెప్పారు. ఎంపీ డీకే అరుణ మాట్లాడుతూ రైల్వేస్టేషన్లను అభివృద్ధి చేసి, సామాన్యులకు అన్ని మౌలిక సదుపాయాలను అందుబాటు లోకి తేవాలని ప్రధాని నరేంద్రమోదీ నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. ఈ సందర్భంగా రైల్వే పాస్‌ల పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని జడ్చర్ల మీడియా సభ్యులు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు పద్మజారెడ్డి, మాజీ ఎమ్మెల్యే గువ్వల బాల్‌రాజ్, రాష్ట్ర నాయకులు అంజయ్య, కార్పొరేటర్ కిరణ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్యాకేజీ పెంపునకు ప్రభుత్వంతో కొట్లాడా!

- రూ.6.50 లక్షల నుంచి రూ.18 లక్షలకు పెంపు
- నిర్వాసితుల నమ్మకాన్ని నిలబెట్టుకోవడం నా బాధ్యత
- జడ్చర్ల శాసనసభ్యుడు జనంపల్లి అనిరుధ్‌రెడ్డి
- రూ.13.69 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

పునరావాస కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి

జడ్చర్ల, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : ఉదండాపూర్ రిజర్వాయర్ నిర్వాసితులకు పునరావాస ప్యాకేజీ పెంపుపై ప్రభుత్వంతో కొట్లాడానని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి అన్నారు. అందుకోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఇరిగేషన్‌శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిలతో చర్చించానని, ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చానన్నారు. తద్వారా ప్యాకేజీ రూ. 6.50లక్షల నుంచి రూ.18 లక్షలకు పెరిగిందని తెలిపారు. జడ్చర్ల మండలంలోని దేవునిగుట్ట తండాకు వెళ్లే దారిలోని ఉదండాపూర్ పునరావాస కేంద్రం వద్ద సోమవారం పలు అభివృద్ధి పనులకు సోమవారం శంకుస్థాపన చేశారు. రూ.13.69 కోట్ల వ్యయంతో నిర్మించనున్న అంగన్‌వాడీ, పశువైద్యశాల, రెండు ఫంక్షన్‌హాల్స్, ఆరు కమ్యూనిటీ భవనాలు, ప్రాథమిక ఆరోగ్యకేంద్రం నిర్మాణాలకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నిర్వాసితులు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకోవడం తన బాధ్యత అన్నారు. నిర్వాసితులకు ఇప్పటికే మూడు విడతలలో రూ.650 కోట్లు వారి ఖాతాల్లో జమ అయ్యాయని తెలిపారు. రాబోయే రోజుల్లో పునరావాస కేంద్రాన్ని అన్ని మౌలిక వసతులతో అభివృద్ధి చేస్తామని, నిర్వాసితులకు మెరుగైన జీవన ప్రమాణాలు కల్పించేందుకు శాయశక్తులా కృషి చేస్తానన్నారు. అంతకుముందు మండలంలోని బండమీదిపల్లి, కిష్టారం, పోలేపల్లి, మాచారం గ్రామపంచాయతీలలో లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్‌కార్డులను పంపిణీ చేశారు. చిన్నపల్లి ప్రాథమిక పాఠశాలలో ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమాలను పరిశీలించారు. ఎఫ్ఎల్ఎన్ ఫోటో ఫ్రేమ్ వద్ద విద్యార్థులతో కలిసి ఫొటో దిగారు. కార్యక్రమంలో జడ్చర్ల తహసీల్దార్ నర్సింగ్‌రావు, జిల్లా, మండల అధికారులు పాల్గొన్నారు.

లక్ష్యాలను నిర్దేశించుకొని చదువుకోవాలి

- నారాయణపేట కలెక్టర్ ప్రియాంక

విద్యార్థినులతో ముచ్చటిస్తున్న కలెక్టర్ ప్రియాంక

నారాయణపేట రూరల్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని.. వాటి సాధనకు నిత్యం సాధన చేయాలని నారాయణపేట కలెక్టర్ ప్రియాంక విద్యార్థులకు సూచించారు. నారాయణపేట జిల్లా కేంద్రంలోని గురుకుల బాలికల పాఠశాల, కళాశాలను సోమవారం తనిఖీ చేశారు. ఇంటర్మీడియట్ విద్యార్థులో ముచ్చటించారు. వారికి ఇష్టమైన సబ్జెక్టులు, భవిష్యత్తు లక్ష్యాలను అడిగి తెలుసుకున్నారు. ఇంటర్మీడియట్ తర్వాత నీట్‌కు ఇప్పటి నుంచే పక్కా ప్రణాళికతో సిద్ధం కావాలని సూచించారు. ప్రతీ రోజు కొంత సమయం కేటాయించి చదువుతో పాటు పునశ్చరణ, మాక్ టెస్టులకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఆసక్తి ఉన్న రంగంలో ఉన్నత స్థాయికి ఎదిగేందుకు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలన్నారు. విద్యాబోధన, వసతి, భోజనం, ఇతర సౌకర్యాలకు సంబంధించిన ఏవైనా ఇబ్బందులు ఎదురైతే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. కలెక్టర్ స్వయంగా తమతో మాట్లాడి, సూచనలు చేయడం, సమస్యలను తెలుసుకొని పరిష్కరిస్తామని చెప్పడంతో విద్యార్థులు సంతోషించారు.

కుల వివక్షను కాంగ్రెస్ ఉపేక్షించదు

- రాహుల్‌గాంధీపై ఎఫ్ఐఆర్ నమోదు చేస్తారా?
- డీసీసీ అధ్యక్షుడు సంజీవ్ ముదిరాజ్
- పాలమూరు నగరంలో ధర్నా

ధర్నాలో కాంగ్రెస్ నాయకులు

మహబూబ్‌నగర్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : కులవివక్షను కాంగ్రెస్ పార్టీ ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించదని, ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు సంజీవ్ ముదిరాజ్ అన్నారు. కులవివక్షకు వ్యతిరేకంగా పోరాడుతున్న రాహుల్‌గాంధీపై ఎఫ్ఐఆర్ నమోదు చేయడం దారుణమని, కేంద్ర ప్రభుత్వ చర్యను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. మహబూబ్‌నగర్ పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో సోమవారం నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. దేశంలో కుల మత విభేదాలను రెచ్చగొట్టి ప్రజలను విభజించే ప్రయత్నాలను కాంగ్రెస్ పార్టీ ఎప్పటికీ సహించబోదన్నారు. రాహుల్ గాంధీపై నమోదైన ఎఫ్ఐఆర్‌ను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు మల్లు నర్సింహారెడ్డి, బెక్కరి అనిత, జహీర్‌అక్తర్, సత్తూరు చంద్రకుమార్‌గౌడ్, బెక్కరి మధు సూదన్‌రెడ్డి, వినోద్‌కుమార్, పోలెపల్లి యాదయ్య, రాము ల్‌యాదవ్, సాయిబాబా, ఖలీం, సీజే బెనహర్, ఆవేజ్, బంగ్లారవి, గోనెల శ్రీనివాస్, ప్రవీణ్‌కుమార్, రమేశ్ బాబా, తాహెర్, ఉమర్‌కొత్వాల్, గోపాల్‌యాదవ్, షబ్బీర్, కంచిమి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.


ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా చికెన్ సెంటర్స్ అసోసియేషన్
నేటి చికెన్ ధరలు
ఫామ్ లైవ్ : 140.00
హోల్ సేల్ : 146.00
డ్రెస్ : 237.00
స్కిన్ లెస్ : 268.00

నిబంధనలా? మానవత్వమా?

- ప్రశ్నించిన ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులు
- విద్యుత్ భవన్ ముందు ఆందోళన

4

ఆంధ్రజ్యోతి దినపత్రికలో...
ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్) కొరకు ఈ క్రింది నెంబర్లకు సంప్రదించగలరు.
మహబూబ్‌నగర్ : 9985411175, 9985403259
నాగర్‌కర్నూల్ : 9985410905
వనపర్తి : 9985403242
గద్వాల : 9985403238
నారాయణపేట : 9985411463
మరిన్ని వివరాలకు సంప్రదించండి
9985411365

మాదకద్రవ్యాల రవాణాపై పోలీసుల ప్రత్యేక నిఘా

- గంజాయి మొక్కలను పండించి రవాణా చేస్తున్న ఇద్దరి అరెస్ట్
- విలేకర్ల సమావేశంలో వివరాలను వెల్లడించిన డీఎస్పీ మొగిలయ్య

విలేకరుల సమావేశంలో పట్టుబడ్డ నిందితులతో డీఎస్పీ మొగిలయ్య

గద్వాల క్రైం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): గద్వాల జిల్లాలో మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయం, వినియోగంపై జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో ప్రత్యేక నిఘా ఉంచి అరికట్టేందుకు కృషి చేస్తున్నామని డీఎస్పీ మొగిలయ్య అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం పట్టుబడ్డ గంజాయికి సంబంధించిన వివరాలను వెల్లడించేందుకు విలేకర్ల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణ పోలీసులకు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు.. కొందరు వ్యక్తులు గంజాయిని తీసుకొస్తున్నారనే సమాచారంతో ఆదివారం సాయంత్రం జిల్లా కేంద్రంలోని మార్కెట్‌యార్డ్ సమీపంలో తనిఖీలు నిర్వహించగా అయిజ వైపు నుంచి గద్వాలకు వస్తున్న ఒక మోటార్‌బైక్‌పై ఇద్దరు వ్యక్తులు ఒక ప్లాస్టిక్ సంచిలో 10 ప్యాకెట్లు గంజాయి లభించడంతో వారిని పట్టణ ఎస్‌ఐ కళ్యాణ్‌కుమార్ విచారించారు. అయితే ఇందులో ఉన్న ఇద్దరు నిందితులలో ఒకరు ఇటిక్యాల మండలం శనిగపల్లికి చెందిన బోయ బీసన్న, రెండవ వ్యక్తి మల్దకల్ మండలం విఠలాపురంకు చెందిన తనగల గోకారి. వీరి నుంచి లభించిన గంజాయిని డ్రగ్ టెస్టింగ్ చేసి గంజాయిగా నిర్ధారించారు. 10 ప్యాకెట్లలో ఐదున్నర కేజీల గంజాయి ఉన్నట్లు నిర్ధారించడంతో వీటి విలువ దాదాపు రూ. 6 లక్షల దాకా ఉంటుందన్నారు. వీరినుంచి స్వాధీనం చేసుకున్న గంజాయిని సీజ్ చేయడంతో పాటు ఒక బైక్, రెండు సెల్‌ఫోన్స్ స్వాధీనం చేసుకొని నిందితులపై ఎన్‌డీపీఎస్ యాక్ట్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తామన్నారు.

కాగా, పట్టణ ఎస్‌ఐ కళ్యాణ్‌కుమార్, సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. ఈ సమావేశంలో సీఐ టంగుటూరి శ్రీను, పట్టణ ఎస్‌ఐ కళ్యాణ్ కుమార్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

- దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి

ఇందిరమ్మ ఇంటిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జీఎంఆర్

దేవరకద్ర, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : అర్హులైన ప్రతీ ఒక్కరికి రెండో విడత లో ఇందిరమ్మ ఇంటిని మంజూరు చేస్తామని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి అన్నారు. మండలంలోని గూరకొండ ఇందిరమ్మ ఇళ్లను సోమవారం ఆయన ప్రారంభించారు. గృహ యజమానులకు నూతన వస్త్రాలు అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గానికి మొదటి విడుతలో 2,500 ఇళ్లు మంజూరు చేసినట్లు తెలిపారు. గత పాలకులు మండలంలో ఎక్కడా ఏ గ్రామంలోనూ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు మంజూరు చేయలేదని తెలిపారు. 416 ఎకరాల్లో బ్రహ్మోస్ క్షిపణి తయారీ కేంద్రం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అనంతరం ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి ప్రొసీడింగ్ అందించి, భూమి పూజ చేశారు. ఆ తర్వాత గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులతో కలిసి కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభించారు. ఉత్తమ ఫలితాలు సాధించి జిల్లా స్థాయిలో పాఠశాలకు పేరుకు తీసుకోరావలన్నారు. అనంతరం ఎమ్మెల్యే విద్యార్థులతో కలిసి పాఠశాలల్లో కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభించారు. సర్పంచ్ హుసేనమ్మ, మండల పార్టీ అధ్యక్షుడు అంజిల్ రెడ్డి, ఎంఈవో బలరాం పాల్గొన్నారు.

శ్రీశైలానికి స్వల్పంగా ఇన్‌ఫ్లో

గద్వాల, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం ప్రాజెక్టుకు సోమవారం స్వల్పంగా ఇన్‌ఫ్లో నమోదు అయ్యింది. జూరాల నుంచి 12,141 క్యూసెక్కులు ప్రాజెక్టులోకి వచ్చి చేరుతున్నాయి. ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 215.81టీఎంసీలు కాగా ప్రస్తుతం 149.41టీఎంసీలకు పడిపోయింది. 885 అడుగులకు గాను 871.80 అడుగుల వద్ద నిల్వ ఉన్నది. పోతిరెడ్డిపాడుకు 8వేలు, హంద్రీనీవా సుజల స్రవంతికి 2,711, కల్వకుర్తి ఎత్తిపోతల పథకానికి 2,400 క్యూసెక్కులను వినియోగిస్తున్నారు. జూరాల ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో పెరిగింది. ప్రాజెక్టులోకి 22,400 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా 21,324 క్యూసెక్కులను విద్యుత్ ఉత్పత్తి ద్వారా శ్రీశైలంకు విడుదల చేస్తున్నారు. 5వేల క్యూసెక్కులను ఎత్తిపోతల పథకాలకు పంపింగ్ చేస్తున్నారు. నారాయణపూర్ ప్రాజెక్టుకు 20వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా 6వేల క్యూసెక్కులను విద్యుత్ ఉత్పత్తి ద్వారా దిగువకు విడుదల చేస్తున్నారు.

క్రీడలతో ఉత్సాహం.. ఆరోగ్యం

- పాలమూరు విశ్వవిద్యాలయం ఉపకులపతి జీఎన్ శ్రీనివాస్

క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న జీఎన్ శ్రీనివాస్

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు ఉత్సాహాన్ని ఆరోగ్యాన్నిస్తాయని పాలమూరు విశ్వవిద్యాయలం ఉపకులపతి జీఎన్ శ్రీనివాస్ అన్నారు. సోమవారం పీయూలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో యూనివర్శిటీ టీచింగ్, నాన్‌టీచింగ్ స్టాఫ్‌నకు నిర్వహించిన క్రీడా పోటీలను ఆయన టాస్‌వేసి ప్రారంభించారు. మహిళలకు నిర్వహించిన టెన్నికాయిట్ పోటీలను వీసీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు తమకు ఇష్టమైన క్రీడల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రమేష్‌బాబు, ప్రొఫెసర్ మధుసూదన్‌రెడ్డి, ప్రొఫెసర్ చంద్రకిరణ్, వై.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ అండర్-19 ప్రాబబుల్స్‌కు ఇద్దరి ఎంపిక

హర్షద్‌అహ్మద్, సామేలు జోసెఫ్

అచ్చంపేటటౌన్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి క్రికెట్ అండర్ -19 ప్రాబబుల్స్‌కు ఏఆర్‌ఎం అకాడమీ అచ్చంపేటకు చెందిన ఇద్దరు క్రీడాకారులు ఎంపికయ్యారు. బ్యాటింగ్ విభాగంలో హర్షద్‌అహ్మద్ బౌలింగ్ విభాగంలో ఆలూరి సామేలు జోసెఫ్ ఎంపికయ్యారు. నిరుపేద కుటుంబాలకు చెందిన వీరి ఎంపికపై నల్లమల క్రీడాకారులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. క్రికెట్‌లో వీరిని తీర్చిదిద్దడంలో కోచ్ ఎండీ జావేద్ కీలకపాత్ర పోషించారు.

కేతావత్ ఉమాపతికి ఉత్తమ కోచ్ అవార్డు ప్రదానం

వెంకటేష్ నుంచి అవార్డు అందుకుంటున్న ఉమాపతి

కొల్లాపూర్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలం బోడ బండతండాకు చెందిన జాతీయస్థాయి క్రీడాకారుడు, వరల్డ్ అథ్లెటిక్స్ కోచ్ కేతావత్ ఉమాపతి ఉత్తమ కోచ్ 2026 అవార్డును అందుకున్నారు. అథ్లెటిక్స్ రంగంలో ఆయన అందిస్తున్న విశిష్ట సేవలకు గుర్తింపుగా ఈ పురస్కారం లభించింది. హైదరాబాద్ మీర్‌పేట్‌లోని బాస్ స్కూల్‌లో ఆదివారం తెలంగాణ వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఈ అవార్డును తెలంగాణ విద్యా కమిషన్ సభ్యుడు చారగొండ వెంకటేష్ చేతుల మీదుగా స్వీకరించారు.

ఆదివాసీ కాంగ్రెస్ చైర్మన్‌గా హనుమంత్ నియామకం

కొల్లాపూర్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా చేపట్టిన సంగఠన్ సృజన్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఆదివాసీ కాంగ్రెస్ కమిటీల బలోపేతానికి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న జిల్లాల్లో చైర్మన్‌లను నియమించారు. ఇందులో భాగంగా మహబూబాబాద్, ములుగు జిల్లాల ఆదివాసీ కాంగ్రెస్ చైర్మన్‌గా కొల్లాపూర్ మాజీ జడ్పీటీసీ హనుమంత్ నాయక్ నియమితులయ్యారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, మంత్రి జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర ఆదివాసీ కాంగ్రెస్ చైర్మన్, ఎమ్మెల్సీ శంకర్ నాయక్ ఆదేశాలతో ఈ బాధ్యతలను హనుమంత్ నాయక్‌కు అప్పగించారు.

జాతీయ స్థాయి సైక్లింగ్ పోటీలకు ఎంపిక

మహమ్మదాబాద్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): మహమ్మదాబాద్ మండల పరిధిలోని చౌదర్‌పల్లి గ్రామానికి చెందిన శ్రీరాములు, గౌతమిల కుమారుడు మోక్షిత్ జాతీయ స్థాయి సైక్లింగ్ పోటీలకు ఎంపికయ్యాడు. ఆదివారం నారాయణపేట జిల్లా మక్తల్‌లో ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా స్థాయిలో 8 నుంచి 11 సంవత్సరాల బాల, బాలికలకు జరిగిన రెండు కిలోమీటర్ల సైక్లింగ్ పోటీలో ప్రథమ స్థానంలో రాణించి ఉత్తమ ప్రతిభ కనబరిచి సెప్టంబరు 10 నుంచి 13 వరకు హైదరాబాద్ బండ్లగూడలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. నారాయణపేట జిల్లా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గోపాలం బాలుడికి కప్పు అందజేసి అభినందించారు. గ్రామానికి చెందిన బాలుడు జాతీయ స్థాయి సైకిలింగ్ పోటీలకు ఎంపికైనందుకు కుటుంబ సభ్యులు, చౌదర్‌పల్లి గ్రామ సర్పంచ్ అనూష సతీష్‌రెడ్డి అభినందించారు.

సీఆర్‌టీకి షోకాజ్ నోటీసు

- డీఈవో విజయకుమారి ఆదేశం
- మహమ్మదాబాద్ కేజీబీవీ తనిఖీ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న డీఈవో విజయకుమారి

మహమ్మదాబాద్ ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : సమాచారం ఇవ్వకుండా విధులకు గైర్హాజరైన కాంట్రాక్ట్ రెసిడెన్షియల్ టీచర్ (సీఆర్‌టీ)కు డీఈవో షోకాజ్ నోటీసులు జారీ చేశారు. మహబూబ్‌నగర్ జిల్లా, మహమ్మదాబాద్ మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ప్రత్యేకాధికారికి, సిబ్బంది మధ్య తగవులతో విద్యార్థులు నష్టపోతున్నారు. ఈ విషయంపై 'విద్యార్థుల భద్రత పట్టదా' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో సోమవారం కథనం ప్రచురితమైంది. అందుకు డీఈవో విజయకుమారి స్పందించారు. విద్యాలయాన్ని సోమవారం తనిఖీ చేశారు. వసతులు, విద్యాబోధన, సమస్యలను పరిశీలించారు. ఆదివారం విధుల్లో ఉండాల్సిన సీఆర్‌టీ నాగరాణి గైర్హాజరు కావడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ప్రతీ రెండవ ఆదివారం మాత్రమే పిల్లలను కలిసేందుకు తల్లిదండ్రులకు అనుమతి ఉంటుందని, ఈ నిబంధనను సక్రమంగా అమలు చేయాలని ఆదేశించారు. సీఆర్‌టీలు తన మాట వినడం లేదని ఇన్‌చార్జి ప్రత్యేకాధికారి డీఈవోకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్ సుదీర్ఘకాలంగా పని చేస్తుండటంతో ఒకరిపై ఒకరు పెత్తనం చెలాయిస్తున్నారని, దీనిపై కలెక్టర్ నివేదిక సమర్పించనున్నట్లు డీఈవో తెలిపారు. అనంతరం జీసీడీవో ఆస్రఖాదీ, ఎంఈవో రాజునాయక్, విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు.

క్రైం కార్నర్

విద్యుదాఘాతంతో మంటలు

- 10 లక్షల ఆస్తి నష్టం

అగ్నికి అంటుకున్న బీరువా, అందులోని వస్తువులు

రాజాపూర్, ఆగష్టు 31 (ఆంధ్రజ్యోతి): మహబూబ్ నగర్ జిల్లా రాజాపూర్ మండలంలోని తిరుమలాపూర్ గ్రామంలో సోమవారం షార్ట్ సర్క్యూట్‌తో 10 లక్షల ఆస్తి నష్టం జరిగిన సంఘటన చోటు చేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. తిరుమలాపూర్ గ్రామానికి చెందిన అజమోని పార్వతమ్మ భర్త భీమయ్య గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు కట్టుకుంటున్నారు. అందులో భాగంగా సమీపంలో ఉన్న ముదిరాజ్ భవనంలో నివాసం ఉంటున్నారు. అదే భవనంలో బుద్దుల వెంకటమ్మ తనకు ఇల్లు లేకపోవడంతో ఉంటున్నారు. ఆదివారం మధ్యాహ్నం విద్యుదాఘాతంతో ఒక్కసారిగా మంటలు అంటుకోవడంతో బీరువాలో ఉన్న నగదు రూ.6 లక్షలు, 3 తులాల బంగారం, వెండి వస్తువులు, బియ్యం, పలు వస్తువులు కాలిపోయి మొత్తం రూ.10 లక్షల ఆస్తి నష్టం జరిగినట్లు గ్రామస్థులు పేర్కొన్నారు. వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి మంటలను అందుపు చేశారు. ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని అక్కడ ఉన్నవారందరు ఊపిరిపిల్చుకున్నారు.

అర్ధరాత్రి చోరీ

- కళ్లహళ్లి ఆంజనేయ స్వామి ఆలయంలో ఘటన

కృష్ణ, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): కళ్లహళ్లి ఆంజనేయ స్వామి దేవాలయంలో అర్ధరాత్రి గల్ల పెట్టే పగలగొట్టి చోరీకి పాల్పడ్డారు. ఈ సంఘటన నారాయణపేట జిల్లా కృష్ణ మండల పరిధిలోని కూసుమూర్తి గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామ శివారులో ఉన్న ఆంజనేయ స్వామి దేవాలయానికి తాళాలు వేసి ఉండగా, పగలకొట్టి దేవాలయంలో ఉన్న ఇత్తడి గంటలు, తాళాలు, మేళాలతో పాటు ఇనుప గల్ల పెట్టే పగులగొట్టి అందులో డబ్బులు ఎత్తుకెళ్లారు. ఆదివారం రాత్రి శ్రావణమాసంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రతీ రోజు భజనను గ్రామస్థులు నిర్వహిస్తారు. ఎప్పటిలాగే ఆదివారం రాత్రి భజన కార్యక్రమానికి వెళ్లగా, దేవాలయం ఇనుప గేట్ తాళం పగిలి ఉండటాన్ని గుర్తించి దొంగలు పడ్డారని స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు గ్రామస్థులు తెలిపారు. భీమా నది ఒడ్డున కర్ణాటక సరిహద్దున సూకూరు లింగపల్లి, ఐనపూర్, కూసుమూర్తి గ్రామాల శివారులో తరచుగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లు, వైర్లు, నీటి మోటార్లు, దేవాలయం ప్రాంగణంలో ఉన్న ఇత్తడి గంటలు, తాళాలు, దొంగతనాలు జరుగుతున్నాయని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బహిరంగ మార్కెట్‌లో ఇత్తడి, రాగి అధిక ధరలో పలుకుతున్నాయి. అందుకు వరుసగా దొంగతనాలు జరుగుతున్నాయి. పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తే దొంగతనాలు కట్టడి చేయాలని గ్రామస్థులు కోరారు.

పాన్ దుకాణంలో...

గద్వాల క్రైం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): గద్వాల జిల్లా కేంద్రంలోని పాన్‌దుకాణంలో ఆదివారం అర్ధరాత్రి చోరీ జరిగిందని బాధితుడు యుగంధర్ తెలిపారు. ఇందుకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. జిల్లా కేంద్రంలోని పాతబస్టాండ్ చౌరస్తాలో ఉన్న ఓ పాన్‌దుకాణంలో ఆదివారం అర్ధరాత్రి చోరీ జరిగి పాన్‌దుకాణంలో ఎయిర్‌టెల్ రీచార్జీలకు ఇవ్వాల్సి ఉన్న రూ. 80వేల నగదుతో పాటు నాలుగు సెల్‌ఫోన్లు, రూ. 10 వేల విలువచేసే సిగరెట్లు చోరీకి గురయ్యాయని బాధితుడు తెలిపాడు.

మొబైల్ దొంగిలించి.. డబ్బు దోచేసి...

- కిరాణ షాపు యజమాని అకౌంట్ నుంచి రూ.లక్షా 4వేలు కాజేసిన కేటుగాడు

అమ్రాబాద్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం మన్ననూర్ గ్రామానికి చెందిన మాచినేని పెద్ద కృష్ణయ్య కిరాణం షాపు యజమాని మొబైల్ ఫోన్ దొంగిలించి ఎస్‌బీఐ బ్యాంక్ అకౌంట్ నుంచి రూ.1,04,010ను కాజేసిన సంఘటన చోటు చేసుకుంది. అమ్రాబాద్ ఎస్‌ఐ హనుమంతురెడ్డి సోమవారం తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 21న శ్రీశైలం హైదరాబాద్ ప్రధాన రహదారి మన్ననూర్‌లో ఉన్న కృష్ణయ్య కిరాణ షాపు వద్దకు గుర్తు తెలియని వ్యక్తి వచ్చాడు. అతని షాపులో వెయ్యి రూపాయలు విలువ చేసే సరుకులను కొనుగోలు చేశాడు. ఇట్టి డబ్బులను తన మిత్రుని ఫోన్‌పే ద్వారా చెల్లిస్తానని ముందుగా అతని నెంబరుకు పది రూపాయలు పంపించాలని చెప్పడంతో షాపు యజమాని ఆ నెంబర్‌కు పంపించాడు. అనంతరం మరికొన్ని వస్తువులు కావాలని చెప్పడంతో షాపు యజమాని కృష్ణయ్య తన మొబైల్‌ను కౌంటర్ దగ్గర వదిలి లోపలికి వెళ్లాడు. కిరాణ సరుకులు తీసుకొచ్చే సరికి కౌంటర్ దగ్గర ఉన్న మొబైల్ ఆ వ్యక్తి కనబడకుండా వెళ్లిపోయారు. తక్షణమే కృష్ణయ్య తేరుకుని సమీపంలో ఉన్న ఎస్‌బీఐ బ్రాంచిలో ఫిర్యాదు చేశాడు. బాధితుడు ఫిర్యాదు చేసే లోపే అకౌంట్ నుంచి డబ్బులు మాయమైనట్లు ఎస్‌ఐ హనుమంతురెడ్డి వివరించారు. ప్రస్తుతానికి బాధితుని అకౌంట్ నెంబరును బ్యాంక్ అధికారులు లాక్ చేసినట్లు తెలిపారు. ఈ సంఘటనపై బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ హనుమంతురెడ్డి తెలిపారు.

పట్టపగలు తాళం వేసిన ఇంట్లో దొంగతనం

- బీరువాను పగులగొట్టి నగదు, నగలను దోచుకెళ్లిన దొంగలు

హన్వాడ, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): పట్టపగలు గుర్తు తెలియని దొంగలు తాళం వేసిన ఇంట్లో నగలు, నగదును దోచుకెళ్లిన సంఘటన మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడ మండలంలోని నాయినోనిపల్లిలో చోటుచేసుకుంది. బాధితుడు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం ఉదయం 5 గంటల ప్రాంతంలో నాయినోనిపల్లి గ్రామానికి చెందిన శంకరి కేశవులు భార్యతో కలిసి హైదరాబాద్ హాస్టల్‌లో ఉన్న కొడుకు దగ్గరకి వెళ్లారు. రాత్రి 8 గంటల ప్రాంతంలో తిరిగి ఇంటికి వచ్చారు.

గేట్ తాళం తీసి చూసేసరికి ఇంటి మెయిన్ డోర్ తాళం విరగ్గొట్టిన దృశ్యం కనిపించడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. బీరువా తాళాలను పూర్తిగా విరగగొట్టారు. ఇంట్లో దాదాపుగా 5 తులాల బంగారు ఆభరణాలు, 13 వేలకు పైగా నగదు దొంగలించినట్లు బాధితుడు తెలిపాడు. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

పోలీసుల సంక్షేమానికి కృషి చేయాలి

- మహబూబ్‌నగర్ ఎస్పీ జానకి
- పోలీస్ అధికారుల సంఘం నూతన కార్యవర్గానికి అభినందనలు

నూతన కార్యవర్గాన్ని అభినందిస్తున్న ఎస్పీ జానకి

మహబూబ్‌నగర్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : పోలీసుల సంక్షేమానికి కృషి చేయాలని మహబూబ్‌నగర్ ఎస్పీ జానకి సూచించారు. పోలీస్ అధికారుల సంఘం నూతన అధ్యక్షుడు పి.సురేశ్ ఆధ్వర్యంలో కార్యవర్గ సభ్యులు సోమవారం ఆమెను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారిని అభినందించిన ఎస్పీ మాట్లాడుతూ సిబ్బంది సమస్యలను తన దృష్టికి తీసుకురావాలని, వాటి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. అధ్యక్షుడు సురేశ్ మాట్లాడుతూ పోలీసు సిబ్బందికి అధికారులకు మధ్య అనుసంధానంగా ఉంటూ, వారి సంక్షేమం కోసం నూతన కార్యవర్గం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో అడిషినల్ ఎస్పీ ఎస్‌బీ రత్నం, డీసీఆర్‌బీ డీఎస్పీ రమణారెడ్డి పాల్గొన్నారు.

నూతన కార్యవర్గ సభ్యులు వీరే..

పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడిగా ఎస్‌బీ హెడ్‌కానిస్టేబుల్ పి సురేశ్, కార్యదర్శిగా వన్‌టౌన్ సీఐ అప్పయ్య ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా ఆర్‌ఐ వై అశోక్‌కుమార్, హన్వాడ ఎస్‌ఐ కే వెంకటేశ్, కోశాధికారిగా టుటౌన్ హెడ్‌కానిస్టేబుల్ బీ శేఖర్, జాయింట్ కార్యదర్శిగా రూరల్ కానిస్టేబుల్ జీ పవన్‌కుమార్‌గౌడ్, కార్యనిర్వహణ కార్యదర్శిగా ఏఆర్ ఎస్‌ఐ యాదగిరయ్యలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యవర్గసభ్యులుగా ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్ పోతురాజు యాదయ్య, హెడ్‌కానిస్టేబుల్ ఏ రవికుమార్, కానిస్టేబుళ్లు జే రాఘవేందర్, ఎల్ రాజేశ్వర్‌రెడ్డి, పద్మమ్మ, టీ సురేశ్‌లను ఎన్నుకున్నారు.

నిబంధనలా? మానవత్వమా?

విద్యుత్ భవన్ ఎదుట నిరసన చేపట్టిన ఎస్సీ,ఎస్టీ ఉద్యోగులు

- ప్రశ్నించిన ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులు
- విద్యుత్ భవన్ ఎదుట ఆందోళన

పాలమూరు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ సంస్థలో ఉన్నతాధికారులు నిబంధనలకా? మానవత్వానికా? దేనికి ప్రాధాన్యమిస్తారని ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ రీజనల్ అధ్యక్షులు కె.నారాయణనాయక్, గంగాధర్ ప్రశ్నించారు. ఇటీవల నలుగురు ఉద్యోగులకు పదోన్నతులు కల్పించి, ఉపసంహరించుకున్న విషయం పాఠకులకు విదితమే. అందుకు నిరసనగా సోమవారం వారు మహబూబ్‌నగర్‌లోని విద్యుత్‌భవన్ ముందు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీజీ ఎస్‌పీడీసీఎల్ మహబూబ్‌నగర్ సర్కిల్‌లో జేఏవో పదోన్నతులను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. నలుగురు జేఏవో పదోన్నతుల్లో ఇద్దరు మహిళలకు సర్కిల్ కార్యాలయంలో, ఇద్దరు పురుషులకు ఇతర ప్రాంతాల్లో పోస్టింగులు ఇచ్చారని తెలిపారు. కానీ తమకు సంబంధించిన పోస్టులను ఎస్సీ, ఎస్టీలకు ఎలా కేటాయిస్తారని ట్రేడ్ యూనియన్ నాయకులు ఎస్‌ఈ చాంబర్ ముట్టడించారని తెలిపారు. దీంతో ఉత్తర్వులను తాత్కాలికంగా నిలిపివేస్తూ ఎస్‌ఈ నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. ఇలా ద్వంద్వ నీతిని ప్రదర్శిస్తే సాయిబాబా కన్వీనర్‌గా ఉన్న టీజాక్ నుంచి తమ అసోసియేషన్ తప్పుకుంటుందని హెచ్చరించారు. కార్యక్రమంలో రీజినల్ వర్కింగ్ ప్రెసిడెంట్ హుస్సేన్, రీజినల్ కార్యదర్శి టి.గంగాధర్, రామకృష్ణ, వెంకట్రాములు, మోహన్‌బాబు, రామకృష్ణ, రామాంజనేయులు, పాటిల్, వెంకట్రాములు తదితరులు పాల్గొన్నారు.

పర్యాటకులకు అత్యుత్తమ సదుపాయాలు అందించాలి

- టీజీటీడీసీ మేనేజింగ్ డైరెక్టర్ గౌతమి

గద్వాల హరిత హోటల్ పరిసరాలను పరిశీలిస్తున్న మేనేజింగ్ డైరెక్టర్ గౌతమి

గద్వాల, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రం పర్యాటక రంగానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తుందని, పర్యాటకులకు మౌలిక సదుపాయాలు, మెరుగైన సేవలు అందించేందుకు నిరంతరం కృషి చేయాలని తెలంగాణ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్(టీజీటీడీసీ) మేనేజింగ్ డైరెక్టర్ గౌతమి అధికారులను ఆదేశించారు. ఈ క్రమంలో హరిత హోటల్ నిర్వహణకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ పర్యాటకులను ఆకట్టుకునేలా అత్యాధునిక సదుపాయాలను సిద్ధం చేయాలన్నారు. జిల్లా కేంద్రంలోని హరిత హోటల్‌ను సోమవారం టీజీడీసీపీ మేనేజింగ్ డైరెక్టర్ సందర్శించారు. ఆమె హరిత హోటల్‌కు లిఫ్ట్, కాంపౌండ్ వాల్ ఏర్పాటుకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.

దేశంలో దిగజారిపోతున్న కార్మికవర్గ పరిస్థితులు

- టీయూసీఐ రాష్ట్ర అధ్యక్షుడు కే సూర్యం

సమావేశంలో మాట్లాడుతున్న కే సూర్యం

వనపర్తి టౌన్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): దేశంలో బీజేపీ ప్రభుత్వ పాలనలో కార్మిక వర్గ పరిస్థితులు దేశంలో రోజురోజుకు దిగజారి పోతున్నాయని టీయూసీఐ రాష్ట్ర అధ్యక్షుడు కే సూర్యం అన్నారు. సోమవారం వనపర్తి జిల్లా కేంద్రంలో టీయూసీఐ (ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా) జిల్లా జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన ఆయన మాట్లాడుతూ దేశంలో మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత 29 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చి కార్మిక హక్కుల ఉల్లంఘనకు పాల్పడిందన్నారు. వాణిజ్య ఒప్పందాలలో దేశ ప్రజలకు, రైతులకు, కార్మికులకు నష్టకరమైన ఒప్పందాలను కుదుర్చుకుంటుందని, కార్పొరేట్ బడా పారిశ్రామికవేత్తలకు దేశ కార్మిక వర్గ శ్రమ, శక్తిని దోచిపెడుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా, రైతు, కార్మిక వ్యతిరేక విధానాలపై తిరగబడాలని అన్నారు. సెప్టెంబరు 6న టీయూసీఐ రాష్ట్ర జనరల్ కౌన్సిల్ సమావేశం ఖమ్మం పట్టణంలో నిర్వహిస్తున్నామని, సమావేశానికి అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. టీయూసీఐ జిల్లా సహాయ కార్యదర్శి గణేష్, శ్రీను, చెన్నయ్య, వెంకటయ్య, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి అమానుషం

- బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి
- మహబూబ్‌నగర్ డిపో ముందు ధర్నా

మహబూబ్‌నగర్ టౌన్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి) : విధుల్లో ఉన్న డ్రైవర్ జానకిరాములుపై దాడి అమానుషమని, అందుకు కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆర్టీసీ జేఏసీ నాయకులు జి.లక్ష్మణ్‌గౌడ్, విజయబాబు, సాయిరెడ్డి, తెల్కపల్లి రాములు, బి. శ్రీనివాసులు డిమాండ్ చేశారు. డ్రైవర్‌పై దాడిని ఖండిస్తూ మహబూబ్‌నగర్ డిపో ముందు సోమవారం మధ్యాహ్నం జేఏసీ నాయకులు ధర్నా నిర్వహించారు. ఆదివారం రాత్రి హైదరాబాద్ నుంచి మహబూబ్‌నగర్‌కు వస్తున్న ఆర్టీసీ బస్సును సైడ్ ఇవ్వలేదన్న నెపంతో ఒక మహిళ తో మరో ముగ్గురు పద్మావతీ కాలనీ వద్ద ఆపారని తెలిపారు. డ్రైవర్ జానకి రాములు వద్దనున్న టిమ్స్‌ను లాక్కొని తలపై మోదగా తీవ్ర రక్తస్రావం అయ్యిందని చెప్పారు. నలుగురు నిందితులను వెంటనే కోర్టులో హాజరుపరిచి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. లేకపోతే బంద్ నిర్వహిస్తామని హెచ్చరించారు. ధర్నాలో జయరాజ్, ఆంజనేయులు, విజయలక్ష్మి, బస్వరాజ్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

- రాఖీ కట్టేందుకు వెళ్తూ.. మృత్యుఒడిలోకి..

ఉండవల్లి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): రాఖీ కట్టేందుకు వెళ్తూ ఓ మహిళ తీవ్రంగా గాయపడగా, చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందిన ఘటన చోటు చేసుకుంది. గద్వాల జిల్లా శాంతినగర్ పట్టణంలోని ఇందిరానగర్ కాలనీకి చెందిన సుశీలమ్మ కర్నూలు జిల్లా పంచలింగాలలో ఉండే తన తమ్ముళ్లకు రాఖీ కట్టేందుకు కొడుకు సునీల్ సాయంతో బైక్‌పై ఆగస్టు 30న బయలుదేరింది. ఉండవల్లి మండలం, బొంకూరు గ్రామంలో ఉన్న స్పీడ్‌బ్రేకర్ వద్ద బైక్ నడుపుతున్న కుమారుడు సునీల్ వేగంగానే వెళ్లాడు.

దీంతో వెనుక కూర్చున్న సుశీలమ్మ రోడ్డుపై పడగా, తలకు బలమైన గాయం కాగా, కర్నూలు ఆసుపత్రికి 108 అంబులెన్స్‌లో తరలించారు. చికిత్స పొందుతూ.. సోమవారం మృతి చెందినట్లు ఎస్‌ఐ సురేష్ తెలిపారు. భర్త లక్ష్మన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

సదా మీ సేవలో..
అచిరకాలంలోనే అశేష ప్రజాదరణ చూరగొన్న ఆంధ్రజ్యోతి కి చందాదారులుగా చేరాలనుకుంటున్నారా!



ఈ క్రింది ఫోన్ నంబర్లను సంప్రదించండి

గద్వాల జిల్లా	:9985404383
మహబూబ్‌నగర్ జిల్లా	: 8096677362
నాగర్‌కర్నూల్ జిల్లా	:8374394441
నారాయణపేట జిల్లా	:9985456557
వనపర్తి జిల్లా	:9010937550

పత్రిక పంపిణీలో ఏవైనా అసౌకర్యాలు కలిగితే నిస్సంకోచంగా ఫోన్ చేసి తెలియజేయగలరు.
సర్క్యులేషన్ మేనేజర్ : 9985411170

అందరివాడు ఆట ఆపేశాడు

ఫుట్‌బాల్‌తో పెద్దగా పరిచయం లేని వాళ్లు కూడా కాసేపు తన ఆట చూస్తే ఆ ఆటలో మజా ఏంటో అర్థమై ఆస్వాదించేలా చేయగల ఆకర్షణ కలిగినవాడు..
మైదానంలో పాదరసంలా కదలాడుతూ, అద్భుతమైన డ్రిబ్లింగ్ నైపుణ్యంతో ప్రత్యర్థుల గుండెల్లో దడ పుట్టించినవాడు..
కళ్లు చెదిరే ఫీల్డ్ గోల్స్‌తో ప్రపంచ రికార్డులు కొల్లగొట్టిన ఘనుడు..
తన మంత్రముగ్ధమైన ఆటతో యావత్ క్రీడాలోకాన్ని ఉర్రూతలూగించినవాడు..
మాటల్లో సౌమ్యుడు, చేతల్లో ఘనాపాఠిగా ఉంటూ అభిమానులకు అపరిమితమైన ఆనందాన్ని పంచిన అందరివాడు..
ఆటనే ప్రేమించి.. ఆటనే శ్వాసించి.. ఆటనే శాసించిన లియోనెల్ మెస్సీ.. ఇక చాలని సెలవు తీసుకొన్నాడు.

అంతర్జాతీయ ఫుట్‌బాల్‌కు మెస్సీ గుడ్‌బై

బ్యూనస్ ఎయిర్స్: అర్జెంటీనా ఫుట్‌బాల్ గ్రేట్ లియోనెల్ మెస్సీ (39) అంతర్జాతీయ కెరీర్‌కు వీడ్కోలు పలికాడు. రెండు దశాబ్దాలపాటు అర్జెంటీనాకు ప్రాతినిథ్యం వహించిన మెస్సీ.. జాతీయ జట్టుకు రిటైర్మెంట్ ప్రకటిస్తున్నట్టు సోమవారం స్పానిష్ భాషలో తన ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టు చేశాడు. రికార్డు స్థాయిలో దేశం తరపున ఆరు వరల్డ్‌కప్‌లు ఆడాడు. 2016లో కోపా కప్ ఫైనల్లో ఓటమి తర్వాత విమర్శలకు తట్టుకోలేక తొలిసారి రిటైర్మెంట్ ప్రకటించిన మెస్సీ. అభిమానుల విజ్ఞప్తితో పునరాగమనం తర్వాత అంతా స్వర్ణ యుగమే. మెస్సీ సారథ్యంలో 2022లో కతార్‌లో జరిగిన సాకర్ ప్రపంచకప్‌లో అర్జెంటీనాను విజేతగా నిలవగా.. 2026 మెగా టోర్నీ ఫైనల్లో స్పెయిన్ చేతిలో ఓడింది. అయితే, తుది పోరులో ఓడిన రెండు రోజుల తర్వాత తన రిటైర్మెంట్ లేఖను రాసినట్టు మెస్సీ తెలిపాడు. కానీ, తన తండ్రి జార్జ్ మెస్సీ అనారోగ్యం, ఆయన మృతి కారణంగా బహిర్గతపర్చడానికి సమయం తీసుకొన్నట్టు తెలిపాడు. కాగా, క్లబ్ సాకర్‌లో లియోనెల్ మరికొంత కాలం కొనసాగే అవకాశం ఉంది. ప్రస్తుతం అతడు ఇంటర్ మయామి కెప్టెన్‌గా ఉన్నాడు. మరో రెండేళ్లపాటు ఆ క్లబ్‌తో అతడికి అగ్రిమెంట్ ఉంది.

‘ఫైనల్ ముగిసిన ఇన్ని రోజుల తర్వాత, ఎంతో ఆలోచించిన తర్వాత, జాతీయ జట్టుకు రిటైర్మెంట్ ప్రకటించాలనే నా నిర్ణయాన్ని మీకందరికీ తెలియజేస్తున్నా. ఇది ఎంతో బాధ కలిగించే నిర్ణయమే అయినా.. అందుకు ఇదే సరైన సమయమని భావిస్తున్నా. అర్జెంటీనా జెర్సీ కోసం సర్వస్వం ధారపోశా. జట్టుతో కలసి దేశానికి ఎన్నో చిరస్మరణీయ విజయాలను అందించా. అర్జెంటీనా ప్రజలను గర్వపడేలా చేయడం ఎప్పుడూ ఆనందమే. ఇక, సమయం తరిగి పోతుంది. కొన్ని అధ్యాయాలు ముగిసిపోనున్నాయి.

సర్వం ధారపోశా..
లియోనెల్ భావోద్వేగ లేఖ

దేశానికి ప్రాతినిథ్యం వహించడం నాకు ఎంతో ఇష్టం. నా దగ్గర ఉన్నదంతా ఇచ్చేశా. ఇక నా వద్ద ఏమీ మిగల్లేదు. ఎంతో మంది ప్రతిభగల యువ ఆటగాళ్లు దూసుకొస్తున్నారు. వారికి ఇదే తగిన సమయం. 20 ఏళ్లుగా అందించిన ప్రేమ, అభిమానానికి కృతజ్ఞతలు. ఇకపై జాతీయ జట్టుకు బయట నుంచి అభిమానించే వ్యక్తిగా ఉంటా. కుటుంబం, కోచ్, సహచరులు, జట్టు అధికారులకు ప్రత్యేక ధన్యవాదాలు. చిరస్మరణీయ జ్ఞాపకాలను నాతో తీసుకెళ్తున్నా. నా సహచరులతో కలసి ఒకప్పుడు కలలు కన్న క్షణాలను.. మీకు అందించామనే సంతృప్తితో సగర్వంగా నిష్క్రమిస్తున్నా. అర్జెంటీనావాడిగా నన్ను పుట్టించినందుకు దేవుడికి కృతజ్ఞతలు. లెట్స్ గో అర్జెంటీనా..’ - లియోనెల్ మెస్సీ



యుగానికొక్కడు

ఎదుగుదల లోపంతో ఏమైపోతాడో? అనుకొన్నవాడు.. తన ఆటతో రెండు దశాబ్దాలపాటు కోట్లాది మంది అభిమానుల హృదయాలను కొల్లగొట్టాడు. కష్టాలకు ఎదురీదాడు.. పట్టుదలతో పోరాడాడు.. ఓర్పుతో నేర్చాడు.. సాకర్ చరిత్రలో మహోన్నత శిఖరంగా నిలిచాడు.

ఓ శకం ముగిసింది!

మెస్సీ మేనియా దాదాపు రెండు దశాబ్దాలపాటు ప్రపంచాన్ని ఊపేసింది. బార్సిలోనా తరపున మెరుపులు మెరిపించిన మెస్సీ.. 2004లో అర్జెంటీనా అండర్-20 జట్టుకు ప్రాతినిథ్యం వహించాడు. అప్పుడు అతడి ఆట విశ్లేషకులను ఎంతగానో ఆకట్టుకొంది. 2005లో 18 ఏళ్ల వయసులో జాతీయ జట్టులోకి వచ్చిన లియోనెల్.. క్రమంగా జట్టు మూలస్తంభంగా మారాడు. 2006 ప్రపంచ కప్‌లో తొలిసారి అర్జెంటీనాకు ప్రాతినిథ్యం వహించాడు. 2009లో జువాన్ రోమన్ రిక్వెల్మీ రిటైర్మెంట్‌తో నెం:10 జెర్సీ మెస్సీకి వచ్చింది. ఇక, 2010 ఫిఫా వరల్డ్‌కప్ అర్జెంటీనా జట్టును మెస్సీ కేంద్రంగా కోచ్ మారడోనా తయారు చేశాడు.

చేదు అనుభవాలు..

జాతీయ జట్టు అర్జెంటీనా తరపున మాత్రం ఎన్నో చేదు అనుభవాలు. 2007 కోపా కప్‌లో ఓటమి.. 2014 వరల్డ్‌కప్ ఫైనల్లో ఓటమి మెస్సీని తీవ్ర నిరుత్సాహానికి గురి చేసింది. 2015, 2016 కోపా కప్‌లో కూడా పరాజయాలతో.. తీవ్ర విమర్శలు ఎదుర్కొన్నాడు. అతడిని జట్టు నుంచి తప్పించాలనే డిమాండ్ బలంగా వినిపించింది. తల్లడిల్లిపోయిన లియోనెల్ ఫుట్‌బాల్‌కు వీడ్కోలు పలికాడు.

శూన్యం నుంచి..

మెస్సీ దూరం కావడంతో ఒక్కసారిగా అర్జెంటీనా జట్టులో శూన్యం ఆవరించింది. తట్టుకోలేక పోయిన ఫ్యాన్స్.. మళ్లీ తిరిగి రావాలని కోరారు. అభిమానుల కోరికను మెస్సీ మన్నించడం అతడి జీవితంలో.. కెరీర్‌లో ఓ మేలి మలుపు. ఎక్కడైతే పోగొట్టుకొన్నారో.. అక్కడే వెతుక్కోమన్నట్టుగా రీఎంట్రీలో మెస్సీ తననుతాను సరికొత్తగా ఆవిష్కరించుకొన్నాడు. 2021లో మరకాన స్టేడియంలో కోపాకప్‌ను అతడు ముద్దాడడం ఫుట్‌బాల్ చరిత్రలోనే భావోద్వేగ సందర్భం. అర్జెంటీనాకు ట్రోఫీ అందించడంతో అతడికి ప్రజలు బ్రహ్మరథం పట్టారు.

‘ఎడారి’లో దాహం తీరింది..

2022 కతార్‌లో జరిగిన ఫిఫా వరల్డ్‌కప్.. ఒక రకంగా మెస్సీకి చివరి అవకాశం అని భావించారు. మెగా టోర్నీ తొలి మ్యాచ్‌లోనే సౌదీ అరేబియా చేతిలో ఓటమి. ఇంత గొప్ప ఆటగాడి కెరీర్ వరల్డ్‌కప్‌ను అందుకోకుండానే ముగుస్తుందా? అనే నిర్వేదం. కానీ, డీలా పడిన జట్టులో స్ఫూర్తిని రగిల్చిన మెస్సీ.. వరుస విజయాలతో జట్టును ఫైనల్‌కు చేర్చాడు. ఫ్రాన్స్‌తో టైటిల్ ఫైట్‌లో డ్రామా నడిచినా.. షూటౌట్‌లో అర్జెంటీనాను గెలిపించిన మెస్సీ.. ‘గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్‌టైమ్’గా తనపేరును చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించుకొన్నాడు. 2024లో మెస్సీ సారథ్యంలో అర్జెంటీనా మరోసారి కోపా అమెరికా కప్ విజేతగా నిలవగా.. 2026 ప్రపంచకప్‌లో డిఫెండింగ్ చాంప్‌గా బరిలోకి దిగిన అర్జెంటీనాను లియోనెల్ మరోసారి ఫైనల్‌కు చేర్చాడు.

హైదరాబాద్‌తో అనుబంధం

భారత పర్యటనలో భాగంగా గత ఏడాది డిసెంబరు 13న మెస్సీ హైదరాబాద్‌కు విచ్చేశాడు. మెస్సీ రాకను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న తెలంగాణ ప్రభుత్వం అతడికి ఘన స్వాగతం పలికేందుకు భారీ ఏర్పాట్లు చేసి.. ఔరా అనిపించింది. ఫలక్‌నుమా ప్యాలెస్‌లో బస చేసిన మెస్సీ, తొలుత అక్కడ కొద్ది మంది అభిమానులతో ఫొటోలు దిగాడు. అనంతరం ఉప్పల్ స్టేడియంలో ఏర్పాటు చేసిన స్నేహపూర్వక ఫుట్‌బాల్ మ్యాచ్‌లో సీఎం రేవంత్ రెడ్డితో కలిసి మెస్సీ కొద్దిసేపు ఆడడం ఈ పర్యటనకే హైలైట్‌గా నిలిచిపోయింది. ఈ మ్యాచ్‌ను వీక్షించేందుకు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీతో పాటు పలువురు సెలెబ్రిటీలు ఉప్పల్ స్టేడియానికి తరలి వచ్చారు. మ్యాచ్ అనంతరం మెస్సీ స్టేడియం మొత్తం తిరుగుతూ తన కోసం వచ్చిన అభిమానులకు అభివాదం చేశాడు. ఆతర్వాత స్టేడియంలోనే యువ క్రీడాకారులతో కొద్దిసేపు ముచ్చటించి, వారికి కొన్ని సలహాలు కూడా ఇచ్చాడు.

మీ ఆట.. ప్రపంచానికి ప్రేరణ సీఎం రేవంత్

మెస్సీ రిటైర్మెంట్‌పై సీఎం రేవంత్ రెడ్డి స్పందించారు. ‘మీరు ప్రపంచవ్యాప్తంగా ఫుట్‌బాల్ ప్రేమికులను ఉర్రూతలూగించారు.. స్ఫూర్తినిచ్చారు. మీతో కలిసి ఫుట్‌బాల్ మైదానంలో కొన్ని నిమిషాలు గడపడం నాకు దక్కిన గౌరవంగా భావిస్తున్నా. మీరు లేని ఫుట్‌బాల్ మునుపటిలా ఉండదు. వీడ్కోలు పలికినా.. మీ స్ఫూర్తి మరెందరినో ప్రేరేపిస్తూనే ఉంటుంద’ని రేవంత్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

కుటుంబం..

మెస్సీ తన చిన్ననాటి స్నేహితురాలు ఆంటోనెలా రొకుజోను కొన్నాళ్ల సహజీవనం అనంతరం 2017 జూలైలో పెళ్లాడాడు. వారికి ముగ్గురు సంతానం. పెద్దకొడుకు థియాగో మెస్సీ 2012లో, రెండో కుమారుడు మాటెయో మెస్సీ 2015లో, మూడో కొడుకు సిరో మెస్సీ 2018లో జన్మించారు. ఇక మెస్సీ తండ్రి జార్జ్ ఈ మధ్యే మృతిచెందారు. మెస్సీకి తల్లి, ఇద్దరు అన్నలు, ఓ చెల్లెలు ఉన్నారు.

కెరీర్ ఘనతలు..

- అర్జెంటీనా జాతీయ జట్టు తరఫున 207 మ్యాచ్‌ల్లో 125 గోల్స్ చేశాడు.
- 8 సార్లు బాలన్ డీ ఓర్ అవార్డులు.
- తన కెప్టెన్సీలో అర్జెంటీనాకు ఓ ప్రపంచ కప్ (2022).
- తన సారథ్యంలో రెండు కోపా అమెరికా టైటిళ్లు (2021, 2024).
- ఒలింపిక్ క్రీడల (2008 బీజింగ్) స్వర్ణం.
- ఆరుసార్లు యూరోపియన్ గోల్డెన్ బూట్ అవార్డు.
- అత్యధిక మ్యాచ్‌లకు (133) కెప్టెన్సీ ఘనత.
- పది పర్యాయాలు హ్యాట్రిక్ గోల్స్.

అచ్చం సచిన్‌లాగే!

క్రికెట్ దిగ్గజం సచిన్‌కు, ఫుట్‌బాల్ గ్రేట్ మెస్సీల ప్రపంచకప్ విజయాల్లో కొన్ని పోలికలున్నాయి. సచిన్ పదో నెంబర్ జెర్సీని ధరిస్తే.. మెస్సీది కూడా అదే నెంబర్ జెర్సీ 2003 వన్డే ప్రపంచకప్ ఫైనల్లో ఓటమిపాలైన సచిన్.. ఎనిమిదేళ్ల తర్వాత 2011లో విశ్వకప్‌ను అందుకున్నాడు. అలాగే 2014 ప్రపంచకప్ తుది పోరులో రన్నరప్‌నకు పరిమితమైన మెస్సీ.. సరిగ్గా ఎనిమిదేళ్ల అనంతరం 2022లో విశ్వవిజేతగా నిలిచాడు. ఇలా, వేర్వేరు క్రీడల్లో ఇద్దరు అత్యుత్తమ ఆటగాళ్ల మధ్య పోలికలుండడం విశేషమే కదా!

మారడోనాతో..

ఆటను శాసించాడు

అలనాటి దిగ్గజం పీలే, తరువాతి తరం హీరో డీగో మారడోనా..ప్రస్తుత స్టార్ క్రిస్టియానో రొనాల్డోను కాదని లియోనెల్ మెస్సీయే సాకర్ ‘ఆల్‌టైమ్ గ్రేట్’ అనేందుకు లెక్కకు మిక్కిలి ఉదాహరణలున్నాయి..రెండు నెలల కిందట జరిగిన ప్రపంచ కప్ ఫుట్‌బాల్ టోర్నీలో మెస్సీ చేసిన మాయాజాలాన్ని మరువగలమా ! మెగా టోర్నమెంట్‌లో కెప్టెన్‌గా ఒంటిచేత్తో జట్టుకు విజయాలు అందించాడు..అల్జీరియాతో ఆరంభ మ్యాచ్‌లో హ్యాట్రిక్‌తో అదరగొట్టాడు..ఆస్ట్రియాపై రెండు గోల్స్‌తో అద్భుతం చేశాడు..మెగా టోర్నీలో అత్యధికంగా 18 గోల్స్‌తో ఆల్‌టైమ్ గ్రేట్‌గా సరికొత్త చరిత్ర సృష్టించాడు.. జోర్డాన్‌తో పోరులో కళ్లు చెదిరే ఫ్రీకిక్‌తో కొట్టిన గోల్‌ను ఏమని వర్ణించగలం ? ప్రీక్వార్టర్స్‌లో ఈజిప్తుతో, క్వార్టర్స్‌లో స్విట్జర్లాండ్‌తో, సెమీఫైనల్లో ఇంగ్లండ్‌తో నరాలు తెగే ఉత్కంఠభరిత మ్యాచ్‌లలో జట్టును నడిపించి, గెలిపించిన తీరు మెస్సీకే చెల్లు..

అంతర్జాతీయ పోటీలలో ఇకపై లియోనెల్ మెస్సీ మెరుపులను చూడలేకపోవచ్చు. కానీ క్లబ్ సాకర్‌లో 39 ఏళ్ల అర్జెంటీనా సూపర్ స్టార్ ఆటను కనులారా వీక్షించవచ్చు. రెండు దశాబ్దాల తన కెరీర్‌లో ఫుట్‌బాల్‌ను మరో స్థాయికి తీసుకెళ్లిన ఘనత మెస్సీది. స్వయంగా గోల్స్ కొట్టడంలో ఎంత మేటో..సహచరులు గోల్స్ సాధించేలా అవకాశాలు సృష్టించడంలో మెస్సీ అంతకు మించిన మొనగాడు. ఫుట్‌బాల్ ప్రపంచాన్ని ఊపేసిన మెస్సీ..అసలు సాకర్‌కే పనికిరాడని స్వస్థలం రొసారియో కోచ్‌లు పొమ్మన్నారు. ‘పొట్టిగా ఉన్నావు. ఈ ఆటకేం సరిపోతావు’ అని ఎద్దేవా చేశారు. పైగా..11 ఏళ్ల వయసులో హార్మోన్ ఎదుగుదల లోపం బయటపడడం మెస్సీకి ప్రతికూలమైంది. కానీ అమ్మమ్మ సెలియా ఒలివేరాకు మనవడు మెస్సీ ప్రతిభపై ఎనలేని నమ్మకం. ఆ విశ్వాసంతో కోచ్‌లను ఒప్పించి మనవడికి శిక్షణ ఇప్పించింది. ఈ తరుణంలో అమ్మమ్మ మరణించడం అతడిని తీరని విషాదంలోకి నెట్టింది. అయితే తనను గొప్ప సాకర్ ఆటగాడిగా చూడాలన్న అమ్మమ్మ స్వప్నం నెరవేర్చే లక్ష్యంతో మెస్సీ ఆ విషాదాన్ని దిగమింగాడు. లియోనెల్ సాకర్ స్టార్‌గా ఎదగడంలో బార్సిలోనా క్లబ్‌ది కీలక పాత్ర. మిగతా క్లబ్‌లన్నీ నో చెప్పిన వేళ..మెస్సీని తమ క్లబ్‌లో చేర్చుకొని అతడి అనారోగ్యానికి చికిత్స ఇప్పించడంతోపాటు సాకర్ ప్లేయర్‌గా తీర్చిదిద్దింది. 2004లో 17 ఏళ్ల వయస్సులో బార్సిలోనా తరపున పోటీ సాకర్‌లోకి అడుగుపెట్టిన మెస్సీ 2005లో హంగేరి జట్టుపై అర్జెంటీనాకు అరంగేట్రం చేశాడు. ఆపై ప్రపంచ ఫుట్‌బాల్‌పై చెరగని ముద్ర వేశాడు.

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)

హార్దిక్, నితీశ్ ఫిట్!

సుందర్ కూడా ● అఫ్ఘాన్‌తో టీ20 సిరీస్‌కు సిద్ధం

హార్దిక్

బెంగళూరు: అఫ్ఘానిస్థాన్‌తో టీ20 సిరీస్‌కు ముందు భారత్‌కు శుభవార్త. గాయాలతో బాధపడుతూ పునరావాస శిబిరంలో ఉంటున్న హార్దిక్ పాండ్యా, నితీశ్ కుమార్, వాషింగ్టన్ సుందర్ కోలుకుంటున్నారు. జట్టు ఎంపిక కోసం జాతీయ సెలెక్టర్లు ఈ వారంలో సమావేశం కానున్నారు. ఈనేపథ్యంలో హార్దిక్, నితీశ్ పేర్లను పరిగణనలోకి తీసుకోనున్నారు. హార్దిక్ తన మకాంను ముంబై నుంచి బెంగళూరుకు మార్చిన విషయం తెలిసిందే. అటు ప్రస్తుతం చెన్నైలో ఉన్న సుందర్ జట్టు సెలెక్షన్‌కన్నా ముందే సీఓఈలో ఫిట్‌నెస్ టెస్టుకు హాజరయ్యే అవకాశం ఉంది.

ఆసియా క్రీడలకు బుమ్రా: అఫ్ఘాన్‌తో సిరీస్‌కు బుమ్రా అందుబాటులో ఉండేది సందేహంగా మారింది. గాయం నుంచి కోలుకుంటున్న అతను ప్రస్తుతం సీఓఈలోనే ఉన్నాడు. అయితే ఆసియాకప్‌నకు బుమ్రా ఎంపికయ్యే అవకాశం ఉందని బోర్డు వర్గాలు పేర్కొన్నాయి.

జొకోకు ఝలక్

అర్జెంటీనా యువ ఆటగాడి చేతిలో ఓటమి ● యూఎస్ ఓపెన్



తొలి రౌండ్‌లోనే ఇంటిముఖం

మరీనో నవోన్

న్యూయార్క్: యూఎస్ ఓపెన్‌లో పెను సంచలనం నమోదైంది. నాలుగో సీడ్ నొవాక్ జొకోవిచ్ (39)కు తొలి రౌండ్‌లోనే షాక్ తగిలింది. సోమవారం జరిగిన పురుషుల సింగిల్స్ మొదటి రౌండ్‌లో జొకో 6-7(5), 7-5, 6-4, 2-6, 1-6తో మరీనో నవోన్ (అర్జెంటీనా) చేతిలో ఐదుసెట్లపాటు పోరాడి ఓడాడు. 4 గంటల 36 నిమిషాలపాటు సాగిన మారథాన్ మ్యాచ్‌లో జొకో కండరాల నొప్పులతో తీవ్రంగా ఇబ్బందులు పడ్డాడు. అంతేకాకుండా మ్యాచ్ ముగిసిన తర్వాత కన్నీటి పర్యంతమయ్యాడు. యూఎస్ ఓపెన్‌లో నొవాక్ తొలిరౌండ్‌లోనే వెనుదిరగడం అతడి కెరీర్‌లో ఇదే మొదటిసారి. మరోవైపు 25 ఏళ్ల నవోన్ కెరీర్‌లో ఈ ఏడాదే తొలి ఏటీపీ టైటిల్ నెగ్గాడు. ఇతర మ్యాచ్‌ల్లో 15వ సీడ్ అలెగ్జాండర్ బబ్లిక్ (కజకిస్థాన్) 6-4 6-2, 3-6, 6-1తో జె ఉల్ఫ్ (అమెరికా)పై, జైమ్ ఫరియా 6-3, 7-6(4), 4-6, 1-6, 6-2తో జాన్సన్ బ్రూక్స్‌బైపై గెలిచారు. మహిళల సింగిల్స్‌లో 9వ సీడ్ ఎలెనా స్విటోలినా 6-1, 6-2తో సోలాన్ సియర్రా (అర్జెంటీనా)ను, కరోలినా ప్లిస్కోవా (చెక్) 2-6, 7-5, 6-3తో హన్నే వాండవింకిల్‌ను, 18వ సీడ్ ఎకటరీనా అలెగ్జాండ్రొవా 6-2, 6-2తో మెకార్తీ కెస్లర్‌ను ఓడించారు. కాగా, వీనస్ విలియమ్స్ 2-6, 6-7(6) సోఫియా కెనిన్ చేతిలో పరాజయం పాలైంది.

వైభవ్ సెంచరీ మిస్

దులీప్ ట్రోఫీ

ఈస్ట్‌జోన్ 266 ఆలౌట్
నార్త్‌పై తిలక్‌వర్మ శతకం

వైభవ్ (92)

బెంగళూరు: ఈస్ట్‌జోన్ వైస్ కెప్టెన్ వైభవ్ సూర్యవంశీ దులీప్ ట్రోఫీ సెమీఫైనల్లో చెలరేగాడు. ఎడాపెడా షాట్లతో తన శైలిలో పరుగులు రాబట్టాడు. అయితే కొద్దిలో శతకం కోల్పోయాడు. సెంట్రల్ జోన్‌తో మ్యాచ్‌లో..సోమవారం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన ఈస్ట్‌జోన్ 266 పరుగులకు ఆలౌటైంది. వైభవ్ (81 బంతుల్లో 7 ఫోర్లు, 7 సిక్స్‌లతో 92), మరో ఓపెనర్ అభిమన్యు (69) మొదటి వికెట్‌కు 161 పరుగులు జోడించారు. ఆపై సెంట్రల్‌జోన్ బౌలర్లు విజృంభించడంతో ఈస్ట్‌జోన్ 266 పరుగులకే చేతులెత్తేసింది. సెంట్రల్‌జోన్ మొదటి ఇన్నింగ్స్‌లో 266 రన్స్ చేసిన విషయం విదితమే. అనంతరం రెండో ఇన్నింగ్స్ చేపట్టిన సెంట్రల్‌జోన్ రెండో రోజు ఆఖరికి 45/3తో ఆడుతోంది.

సూర్యవంశీ రికార్డు పుటల్లో: అతి పిన్న వయస్సు (15 సంవత్సరాల 157 రోజులు)లో దులీప్ ట్రోఫీలో అర్ధ శతకం సాధించిన బ్యాటర్‌గా వైభవ్ రికార్డుల కెక్కాడు. ఈక్రమంలో 57 ఏళ్లనాటి(1969) లక్ష్మణ్ సింగ్ (16 ఏళ్ల 23 రోజులు) పేరిట ఉన్న రికార్డును దాటేశాడు.

తిలక్ వర్మ (106 బ్యాటింగ్)

సౌత్‌జోన్ 285/9: కెప్టెన్ తిలక్ వర్మ (106 బ్యాటింగ్) శతకబాదడంతో నార్త్‌జోన్‌తో సెమీఫైనల్లో సౌత్‌జోన్ తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం అందుకుంది. కిందటి రోజు స్కోరు 40/2తో సోమవారం, మొదటి ఇన్నింగ్స్ కొనసాగించిన సౌత్‌జోన్ ఆట ముగిసే సరికి 285/9 పరుగులు చేసింది. తిలక్, గోపాల్ (87) ఆరో వికెట్‌కు 175 పరుగులు జోడించారు. నార్త్‌జోన్ తొలి ఇన్నింగ్స్‌లో 195 పరుగులకే ఆలౌటైన సంగతి తెలిసిందే.

బరిలో లక్ష్య, సాత్విక్ జోడీ

చైనా మాస్టర్స్ నేటి నుంచి

షెన్‌ఝున్: వరల్డ్ చాంపియన్‌షిప్స్‌లో అనామక ఆటగాడి చేతిలో కంగుతిన్న ఏస్ షట్లర్ లక్ష్య సేన్ మంగళవారం నుంచి జరిగే చైనా మాస్టర్స్‌లో టైటిలే లక్ష్యంగా బరిలోకి దిగనున్నాడు. శ్రీకాంత్ కూడా బరిలో నిలవనున్నాడు. మహిళల సింగిల్స్‌లో ఉన్నతి హుడా, తన్వీ శర్మ, దేవిక సిహాగ్ సత్తా చాటాలనుకొంటున్నారు. డబుల్స్‌లో సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి, అర్జున్-హరిహరన్, మిక్స్‌డ్‌లో కపిల-తనీషా, రోహన్ కపూర్-రుత్విక జోడీలు ఆడనున్నాయి.

పారా ప్యాడ్లర్ల పతక మోత

న్యూఢిల్లీ: ఫిన్లాండ్ జరిగిన పారా టేబుల్ టెన్నిస్‌లో భారత ఆటగాళ్లు 16 పతకాలతో దుమ్ము రేపారు. 6 స్వర్ణ, 4 రజత, 6 కాంస్యాలతో పోటీలను ఘనంగా ముగించారు. సింగిల్స్ విభాగాలలోనే 10 పతకాలు కొల్లగొట్టారు. డబుల్స్‌లో 2 స్వర్ణ, ఒక రజత, 3 కాంస్యాలు లభించాయి.

న్యూస్‌బాక్స్..

ఏడు రకాల వరికే బోనస్

గండీడ్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ఎంపిక చేసిన ఏడు రకాల ధాన్యానికే రూ.500 బోనస్ అందించనున్నట్లు ఏవో రాధమ్మ సోమవారం తెలిపారు. బోనస్ పొందాలంటే ఈనెల 10లోపు విత్తన డీలర్ల వద్ద తెచ్చిన రకాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయించాలన్నారు. రైతులు సొంత సన్న రకాల విత్తనాలు వేసుకుంటే ఏఈవో వద్ద నమోదు చేయించుకోవాలన్నారు.

ఆర్థిక సాయం అందజేత

గండీడ్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పగిడ్యాల్‌కు చెందిన నీరటి బుడ్డమ్మ మృతి చెందగా, గ్రామస్థులు పోగు చేసిన రూ.7 వేలు సోమవారం బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ అంబేడ్కర్ సంఘం జిల్లా అధ్యక్షుడు కృష్ణయ్య, ఉప సర్పంచు శివయ్య, ఎంపీటీసీ మాజీ సభ్యుడు కృష్ణయ్య, వీరన్న, గోపాల్, భీమయ్య, కృష్ణయ్య పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరం విజయవంతం

జడ్చర్ల, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గంగాపురంలో కొత్తూరు బ్రాంచి ఎల్‌వి ప్రసాద్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో సోమవారం కంటి వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని సర్పంచు గిరిప్రసాద్‌యాదవ్ ప్రారంభించగా, గ్రామస్థులు కంటి పరీక్షలు చేయించుకున్నారు. జీపీవో సబితారాణి, పంచాయతీ కార్యదర్శి శివ పాల్గొన్నారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు

బాలానగర్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో మండలంలోని వివిధ పాఠశాలల విద్యార్థులకు ఇంట్యాగ్ సంస్థ ఆధ్వర్యంలో ఇండియన్ హెరిటేజ్‌కు సంబంధించిన అంశంపై క్విజ్ పోటీలు నిర్వహించారు. మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులు ప్రథమ బహుమతి, కేజీబీవీ పాఠశాల విద్యార్థులు ద్వితీయ బహుమతి గెలుపొందగా, ఎంఈవో శంకర్‌నాయక్ అందజేశారు.

బాల్య వివాహాలు నేరం

నవాబ్‌పేట, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : బాల్యవివాహాలు, మానవ అక్రమ రవాణా చట్టరీత్యా నేరమని నవాబ్‌పేట ఎస్‌ఐ నరేందర్ పేర్కొన్నారు. సోమవారం రాత్రి మండల కేంద్రంలోని పాత గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కళాజాతలో ఆయన పాల్గొని, మాట్లాడారు. సైబర్ నేరాలు, బాల్యవివాహాలు, బాలకార్మిక వ్యవస్థ, మాదక ద్రవ్యాల వినియోగం చట్టరీత్యా నేరమన్నారు. సర్పంచు గీతారాణి, సురేష్, కళాజాత సిబ్బంది సుజాత, ఏఎస్‌ఐ సక్రియ, రాములు, జ్యోతి, జగదీష్, బాలరాజు పాల్గొన్నారు.

ఉద్యోగి బాధ్యతలు గొప్పవి

నవాబ్‌పేట, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : ఉద్యోగ బాధ్యతలు చాలా గొప్పవని నవాబ్‌పేట ఎస్‌ఐ నరేందర్ పేర్కొన్నారు. సోమవారం నవాబ్‌పేట పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న శ్రీనివాసులు పదవీ విరమణ కార్యక్రమంలో పాల్గొని, సన్మానించారు. అంతకుముందు నవాబ్‌పేట పీహెచ్‌సీలో డీపీఎంవోగా విధులు నిర్వహిస్తున్న కృష్ణయ్య పదవీ విరమణ కార్యక్రమానికి పీహెచ్‌సీ డాక్టర్ శ్రావణ్‌కుమార్ సన్మానించారు. బాలమ్మ, సుధాకర్, శ్రీనివాసులు, రాఘవేందర్, సమత, భవాని, వహబ్ పాల్గొన్నారు.

ఆన్‌లైన్ నమోదులో అధికారులు

హన్వాడ, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : కొత్త పింఛన్ దరఖాస్తు గడువు ముగుస్తుండటంతో పంచాయతీ కార్యదర్శులు, ఎంపీడీవో కార్యాలయ అధికారులు సోమవారం ఆన్‌లైన్ నమోదులో నిమగ్నమయ్యారు. మండలంలో ఇప్పటి దాకా దాదాపు 900 పైగా దరఖాస్తులు ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. వితంతు, ఒంటరి మహిళ, కల్లుగీత, చేనేత కార్మికులు దరఖాస్తు చేసుకున్నారు.

పండుగ సాయన్న విగ్రహ ఏర్పాటుకు భూమి పూజ

గండీడ్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రెడ్డిపల్లి గ్రామ పంచాయతీ పక్కన పండుగ సాయన్న విగ్రహ ఏర్పాటుకు సోమవారం భూమిపూజ చేశారు. శ్రీనివాస్‌రెడ్డి, వెంకటయ్య, కృష్ణయ్య, మల్లప్ప, రామయ్య, సాయన్న, ఆంజనేయులు, కృష్ణారెడ్డి, మాధవరెడ్డి,రాఘురాంరెడ్డి పాల్గొన్నారు.

సర్ అభ్యంతరాల స్వీకరణ ప్రారంభం

మహబూబ్‌నగర్ అర్బన్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : సర్‌లో భాగంగా అభ్యంతరాల దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. సోమవారం నగరంలోని ఎంప్లాయీస్ కాలనీలో 132, 133 బూత్ నెంబర్లలో 600 మందికి వచ్చిన నోటీసులపై దరఖాస్తులు స్వీకరించారు. మహబూబ్‌నగర్ అర్బన్ తహసీల్దార్ ఘన్సీరాం విచారణ చేశారు. కార్పొరేటర్ కిషన్‌నాయక్ పాల్గొన్నారు.

3న కలెక్టరేట్ ముట్టడి

పాలమూరు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : వైద్య రంగంలో పనిచేస్తున్న ఒకటో, రెండో ఏఎన్‌ఎంలు, యూరోపియన్ ఏఎన్‌ఎంలు, అర్బన్ ఏఎన్‌ఎంల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ రాష్ట్ర నాయకుడు భూపాల్ డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పని ఒత్తిడి తగ్గించాలని, అధికారుల వేధింపులు ఆపాలని, పేస్కేల్ ప్రకటించి, పర్మినెంట్ చేయాలని, సెలవులు ఇవ్వాలని కోరుతూ 3వ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపడుతున్నట్లు తెలిపారు. ఏఎన్‌ఎంలు, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు తరలిరావాలని పిలుపునిచ్చారు. సీఐటీయూ నాయకులు కిల్లెగోపాల్, నల్లవెల్లి కురుమూర్తి, చంద్రకాంత్, వీరాంజనేయులు, విజయవర్ధన్‌రాజు పాల్గొన్నారు.

సమన్వయంతో పని చేయాలి

» అధికారుల సమీక్షా సమావేశంలో అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్

హాజరైన అధికారులు, మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను నిర్దేశిత లక్ష్యాల మేరకు వేగవంతం చేసేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్ ఆదేశించారు. ప్రజావాణి అనంతరం అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వన మహోత్సవంలో భాగంగా జిల్లాలో చేపడుతున్న మొక్కలు నాటే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, ప్రభుత్వ పథకాలు, సంక్షేమ కార్యక్రమాలు క్షేత్రస్థాయిలో అర్హులకు పూర్తిస్థాయిలో చేరేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. పింఛన్లు, ఇందిరమ్మ ఇళ్లు, గ్రామీణాభివృద్ధి కార్యక్రమాలు, వనమహోత్సవం, భూభారతి, ప్రజావాణి కార్యక్రమాల అమలుపై శాఖల వారీగా క్రమం తప్పకుండా సమీక్ష నిర్వహించాలన్నారు.

ఫిర్యాదులు సత్వరం పరిష్కరించాలి..

ప్రజావాణి ఫిర్యాదులు సత్వరం పరిష్కరించాలని అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణికి వచ్చిన ఫిర్యాదులు స్వీకరించి, మాట్లాడారు. ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసమే ప్రజావాణి నిర్వహిస్తున్నామని, అధికారులు సమన్వయంతో పనిచేసి, ఆర్జీలకు ప్రాధాన్య తనిస్తూ ఫిర్యాదులు వెంటనే పరిష్కరించాలని అధికారులకు ఆదేశించారు. సమావేశంలో డీఆర్వో నిర్మల, జెడ్పీ సీఈవో వెంకట్‌రెడ్డి, డీఆర్డీవో నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ధ్యేయం

» ఎమ్మెల్యే జీ.మధుసూదన్‌రెడ్డి

మూసాపేట, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : పేద బడుగు, బలహీన వర్గాల సంక్షేమంతో పాటు రైతులకు సాగునీరు అందించి ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే జీ.మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం అడ్డాకుల, మూసాపేట మండలాలకు కెఎల్‌ఐ లిఫ్టు ద్వారా సాగునీరు రావడానికి వచ్చే మార్గాలను పరిశీలించారు. మంగనూర్, రాంపల్లి, లోకసముద్రం ద్వారా వచ్చే కాల్వలను పరిశీలించారు. కందూరు బైరం చెరువుకు కేఎల్‌ఐ సాగునీరు వచ్చే సాధ్యసాధ్యాలను నీటి పారుదల శాఖ అధికారులతో సమీక్షించారు. గట్టుకాడిపల్లి వద్ద రెండు కిలో మీటర్ల దూరంలో కాల్వను చేస్తే అడ్డాకుల, మూసాపేట మండలాలకు నీరు వచ్చే అవకాశం ఉందన్నారు. కేఎల్‌ఐ డీ8, డీ12, డీ 13 కాల్వల ద్వారా ఈ రెండు మండలాలకు సాగునీరు రావడానికి కావల్సిన ఏర్పాట్లపై సమీక్షించారు. కందూరు వద్ద పంటపొలాల్లో ఉన్న రైతుతో ఎమ్మెల్యే మాట్లాడి, అతనితో కలిసి అక్కడే భోజనం చేశారు. అంతకు ముందు మూసాపేట మండలం స్ఫూర్తితండాలో ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించారు. గుడి నిర్మాణానికి రూ.5 లక్షల నిధులు మంజూరు చేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షులు శెట్టి చంద్రశేఖర్, తోట శ్రీహరి, సర్పంచులు గోపాల్‌నాయక్, మహేందర్, రాంచందర్, నాయకులు నాగిరెడ్డి, జగదీశ్వర్, విజయమోహన్‌రెడ్డి, లక్ష్మినారాయణ, బుచ్చన్నగౌడ్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఇంటిగ్రేటెడ్ పాఠశాల పనుల పరిశీలన

చిన్నచింతకుంట : మండలంలోని దమగ్నాపూర్ గ్రామ శివారులోని ఇంటిగ్రేటెడ్ పాఠశాల

రైతుతో కలిసి భోజనం చేస్తున్న ఎమ్మెల్యే

పనుల పురోగతిని సోమవారం ఎమ్మెల్యే జీఎంఆర్ పరిశీలించారు. అనంతరం సంబంధిత అధికారులతో సమీక్షించారు. కాంగ్రెస్ నాయకుడు సురేందర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు వెంకటేష్, మధు, మల్లికార్జున్, బాలకిష్టారెడ్డి పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

తహసీల్దార్ కార్యాలయ అధికారికి వినతిపత్రం ఇస్తున్న ఏబీవీపీ నాయకులు

జడ్చర్ల, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్ మెంట్, స్కాలర్‌షిప్ నిధులు విడుదల చేయాలని జడ్చర్ల తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఏబీవీపీ ఆధ్వర్యంలో విద్యార్థులు ధర్నా నిర్వహించారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కురుమూర్తి మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓబీసీ, మైనార్టీ విద్యార్థులకు ఉచితంగా ఉన్నత విద్య అందించాలని డిమాండ్ చేశారు. బకాయి ఉన్న రూ.12 వేల కోట్లు విడుదల చేయాలని తహసీల్దార్ కార్యాలయ అధికారికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సాయికుమార్, నవీన్, మహేందర్, సాయి, రఘు, కార్తీక్, మోహన్, చందు, కార్తీక్, అనిల్, రవీందర్ పాల్గొన్నారు.

ముగిసిన ఆరాధనోత్సవాలు

జడ్చర్ల, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని రాఘవేంద్రస్వామి ఆలయంలో చేపట్టిన ఆరాధనోత్సవాలు సోమవారం ఘనంగా ముగిశాయి. ప్రాతఃకాల పూజలు, అభిషేకాలు, భజనలు, మహా మంగళహారతి, రథోత్సవం నిర్వహించారు. అర్చకులు బాలకృష్ణచార్యులు, రాఘవేంద్రచార్యులు, భక్తులు శిరీష్, ప్రవీణ్, రాధాకృష్ణ, శ్రీధర్ పాల్గొన్నారు.

టై, బెల్టుల ప్రదానం

నవాబ్‌పేట, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన నవాబ్‌పేట ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సోమవారం సర్పంచు గీతారాణి విద్యార్థులకు టై, బెల్టులు అందజేశారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి అందరూ కలిసి రావాలన్నారు.

విద్యార్థులకు షూ పంపిణీ

హన్వాడ, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొనగట్టుపల్లి పాఠశాలలో సోమవారం హెచ్‌ఎం ప్రసాద్ విద్యార్థులకు షూ అందజేశారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు యూనిఫామ్స్, షూ ప్రభుత్వం అందజేస్తోందని హెచ్‌ఎం తెలిపారు.

క్రమశిక్షణ కమిటీ జాతీయ చైర్మన్‌గా రమేశ్‌నాయక్

జడ్చర్ల, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : గిరిజన విద్యార్థి సంఘం క్రమశిక్షణ కమిటీ జాతీయ చైర్మన్‌గా జడ్చర్లకు చెందిన రమేశ్ నాయక్‌ను ఎన్నుకున్నారు. హైదరాబాద్‌లోని గిరిజన విద్యార్థి సంఘం కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన జాతీయ కార్యవర్గ సమావేశంలో సంఘం క్రమశిక్షణ కమిటీ జాతీయ కమిటీనికి ఎన్నుకున్నారు.

పార్టీని బలోపేతం చేయాలి

రాజాపూర్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేయాలని, అందుకు ఆయా గ్రామాల సర్పంచులు, వార్డు సభ్యులు, జిల్లా, మండల స్థాయి నాయకులు కృషి చేయాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శేఖర్‌గౌడ్ పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. త్వరలో పూర్తిస్థాయి మండల కమిటీతో పాటు గ్రామ కమిటీలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కమిటీ ఇన్‌చార్జి నరసింహారెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు యాదయ్య, శ్రీనివాస్‌నాయక్, రమేష్, వెంకటేశ్వర్‌రెడ్డి, విక్రమ్‌రెడ్డి పాల్గొన్నారు.

సమాజ సేవలో భాగస్వాములు కావాలి

మహబూబ్‌నగర్ రూరల్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : పదవీ విరమణ పొందిన ఉద్యోగులు సమాజసేవలో భాగస్వాములు కావాలని పీఆర్టీయూ తెలంగాణ జిల్లా అధ్యక్షుడు శ్యాంబాబు పేర్కొన్నారు. సోమవారం మండలంలోని ఫత్తేపూర్ ఉన్నత పాఠశాల జీహెచ్‌ఎం వెంకటమ్మ, గాజులపేటలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయురాలు భూరెడ్డి సుమతిని సన్మానించి, మాట్లాడారు. మండల అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి, మండల కార్యదర్శి మనోహర్ పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలి

మిడ్జిల్ ఎస్‌ఐకి ఫిర్యాదు చేస్తున్న కాంగ్రెస్ ఎస్సీ సెల్ నాయకులు

మిడ్జిల్/హన్వాడ/దేవరకద్ర, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఉత్తరాఖండ్ రాష్ట్రంలో పర్యటించి సభలు, సమావేశాలు ముగించుకుని వచ్చిన నేపథ్యంలో.. కేవలం దళిత నాయకుడనే కారణంతో ఉత్తరఖాండ్ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మహేంద్రభట్ ఖర్గే పాల్గొన్న ఆలయాన్ని శుద్ధి చేయడం దుర్మార్గమైన చర్య అని కాంగ్రెస్ ఎస్సీ సెల్ నాయకులు ఆరోపించారు. ఈ ఘటనకు బాధ్యులైన బీజేపీ కార్యకర్తలు, ఆర్‌ఎస్‌ఎస్ నాయకులపై తక్షణమే ఎస్సీ, ఎస్టీ చట్టం కింద కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో కాంగ్రెస్ ఎస్సీసెల్ ఆధ్వర్యంలో ఎస్సై శ్రీనివాస్‌యాదవ్‌కు ఫిర్యాదు చేశారు. కాంగ్రెస్ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు చెన్నయ్య, డీసీసీ లీగల్ సెల్ వైస్ చైర్మన్ రాజేష్, నాయకులు బంగారు, సైదులు, నందం, సురేష్, మన్నెం, రమేష్, శివకుమార్ పాల్గొన్నారు. హన్వాడ పోలీస్‌స్టేషన్‌లో కాంగ్రెస్ ఎస్సీ సెల్ డిపార్ట్‌మెంట్ మండల అధ్యక్షుడు రాములు, జిల్లా ఉపాధ్యక్షుడు రాములు, కేశవులు, రామాంజనేయులు, కేశవులు, కాశీం ఫిర్యాదు చేశారు. దేవరకద్ర ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు రాములు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు మహేంద్ర బాక్‌పై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలని పోలీసులకు ఫిర్యాదు చేశారు. కన్నయ్య, రాములు పాల్గొన్నారు.

అధికారులు వచ్చినా.. ఫిర్యాదులు అంతంతే

ఫిర్యాదు చేస్తున్న నవాబ్‌పేట ఉప సర్పంచు అజహర్

నవాబ్‌పేట/మహబూబ్‌నగర్ రూరల్/ మిడ్జిల్/కోయిలకొండ/బాలానగర్/హన్వాడ/చిన్నచింతకుంట, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజావాణికి సకాలంలో అధికారులు వచ్చినా.. సమస్యలు చెప్పుకొని వాటిని పరిష్కరించుకునేందుకు ప్రజలు ముందుకు రావడం లేదు. మొత్తం 24 శాఖల అధికారులకు గానూ మూడు శాఖల అధికారులు రాలేదు. ఆరు ఫిర్యాదులు రాగా, ఐదు రెవెన్యూ, ఒకటి విద్యుత్‌కు సంబంధించిన ఫిర్యాదు వచ్చినట్లు తెలిపారు. మహబూబ్‌నగర్ రూరల్ ఎంపీడీవో కార్యాలయంలో తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో కరుణశ్రీ ఆధ్వర్యంలో ప్రజావాణికి భూసర్వే, విద్యుత్ జీరో బిల్లు, పింఛన్ కోసం దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. మిడ్జిల్ మండల కేంద్రంలో నిర్వహించిన ప్రజావాణి ఒక్క ఫిర్యాదు కూడా రాలేదు. కోయిలకొండ ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణికి ఒక దరఖాస్తు వచ్చినట్లు తహసీల్దార్ దీపక్‌రావు తెలిపారు. బాలానగర్ మండల కేంద్రంలో నిర్వహించిన ప్రజావాణికి పెద్దాయపల్లి గ్రామంలోని ఓ వెంచర్‌కు వ్యవసాయ బోరుబావి నుంచి నీటిని అక్రమంగా తరలిస్తున్నారని గ్రామస్థులు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. పంచాయతీ కార్యదర్శి శ్రీను, విద్యుత్ శాఖ ఏఈ చంద్రశేఖర్‌కు ఈ ఘటనపై చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో అనిల్‌రెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. హన్వాడ మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణికి రెండు ఫిర్యాదులు అందినట్లు ఎంపీడీవో యశోదమ్మ తెలిపారు. ఒకటి మండల పరిషత్ కార్యాలయంలో బోరు మెకానిక్‌గా పని చేస్తున్నా జీతం ఇవ్వడంలేదని, మరొకటి ఎర్రగట్టుతండాకు రోడ్డు వేయాలని ఫిర్యాదు చేశారు. చిన్నచింతకుంట మండలం కురుమూర్తి గుట్ట వద్ద కొండలను మైనింగ్ పేరుతో అక్రమంగా తరలిస్తున్నారని, దీన్ని అడ్డుకోవాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నంబి రాజు ప్రోగ్రాం మేనేజర్ సహదేవ్‌కు ఫిర్యాదు చేశారు.

ప్రజావాణికి 13 ఫిర్యాదులు..

జడ్చర్ల : జడ్చర్ల ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణికి 13 ఫిర్యాదులు వచ్చాయి. మునిసిపాలిటీకి సంబంధించి ఐదు ఫిర్యాదులు రాగా, ఒకటి ఆర్‌అండ్ శాఖ, మరొకటి మార్క్‌ఫెడ్ మొక్కజొన్న కొనుగోలు కేంద్రంలో విక్రయించిన మొక్కజొన్నల డబ్బులు రాలేదంటూ ఫిర్యాదు చేశారు. ఆలయ భూములు కాపాడాలని, జర్నలిస్ట్ కాలనీకి కేటాయించిన భూమిని కొందరు అక్రమంగా దున్నుతున్నారంటూ ఫిర్యాదులు వచ్చాయి. సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో వారం రోజులుగా సమస్యలపై సర్వే చేసిన అంశాలతో కూడిన పత్రాన్ని సీపీఎం నాయకులు జగన్, తెలుగుసత్తయ్య అందజేశారు.

ప్రజల సమస్యలు పరిష్కరించాలి : సీపీఎం

పాలమూరు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ అర్బన్ పరిధిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రాములు డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందడం లేదని, గత ప్రభుత్వం నిర్మాణం చేస్తున్న సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 1000 రోజు లైనా నేటికీ పూర్తి చేయకపోవటం విడ్డూరంగా ఉందన్నారు. విద్యార్థులకు హాస్టళ్లలో సరైన వసతులు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. దివిటిపల్లి, వీరన్నపేట, క్రిస్టియన్‌పల్లి కాలనీలో ప్రజలు సమస్యలతో సతమతం అవుతున్నారన్నారు. ధర్నాలో చంద్రకాంత్, రాజ్, మోహన్, వరదగాలెన్న, మునిరా, కొండ్మ, హీనా బేగం, మునీర, నరసమ్మ, అంజమ్మ తదితరులు పాల్గొన్నారు.

దివిటిపల్లికి బస్సు సౌకర్యం కల్పించాలి

ఆర్టీసీ డీఎంకు వినతిపత్రం ఇస్తున్న కార్పొరేటర్ ఆంజనేయులు

మహబూబ్‌నగర్ అర్బన్ /పాలమూరు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ కార్పొరేషన్ పరిధిలోని 4 డివిజన్ దివిటిపల్లి - డబుల్ బెడ్‌రూం కాలనీకి ఆర్టీసీ సౌకర్యం కల్పించాలని కోరుతూ సోమవారం ఆర్టీసీ డిపో మేనేజర్‌కు 4వ డివిజన్ కార్పొరేటర్ అనుప ఆంజనేయులు వినతిపత్రం అందజేశారు. దివిటిపల్లి, డబుల్ బెడ్‌రూం కాలనీ వాసులకు రవాణా ఇబ్బంది ఉందని, అధికారులు స్పందించి మహబూబ్‌నగర్, భూత్పూర్, జడ్చర్ల వెళ్లే రూట్లకు బస్సులు నడింపించాలని విజ్ఞప్తి చేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో 4వ డివిజన్ కాంగ్రెస్ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు మురళి, సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు మోహన్, రాజ్‌కుమార్, ఆదివిష్ణు ఉన్నారు.

పేదల సంక్షేమానికి కృషి

ఇందిరమ్మ ఇంటిని ప్రారంభిస్తున్న సర్పంచు

కోయిలకొండ, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : పేదల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ పథకం తీసుకొచ్చిందని జమాల్‌పూర్ సర్పంచు సంధ్య తెలిపారు. సోమవారం జమాల్‌పూర్‌లో ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకొన్న గొడుగు సంతోష ఇంటిని సర్పంచు ప్రారంభించి, మాట్లాడారు. ఇళ్లు మంజూరైన వారు త్వరగా నిర్మాణాలు పూర్తి చేయాలని కోరారు. వార్డు సభ్యుడు శివకుమార్, నాయకులు నరేష్, యాదయ్య, బాలరాజు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

మిడ్జిల్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి మంగళవారం మండలంలో పర్యటించనున్నట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గౌస్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 9.30 గంటలకు బైరంపల్లిలో స్మార్ట్ రేషన్‌కారుల పంపిణీ అనంతరం కంచన్‌పల్లి, దోనూర్, సింగందొడ్డి, మంగలిగడ్డతండా, చౌటకుంటతండా, ఈదులబాయి తండా, మసిగుండ్లపల్లి, వేముల, వాడ్యాల, బోయిన్‌పల్లి, మల్లాపూర్, కొత్తూరు, అయ్యవారిపల్లి, చిల్వేర్, రాణిపేట్, లింబ్యతండా, కొత్తపల్లి గ్రామాల్లో లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్‌కార్డులు అందజేయనున్నట్లు తెలిపారు.

కేంద్ర మంత్రిని కలిసిన కార్పొరేటర్

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలో పర్యటనకు వచ్చిన కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి, ఎంపీ డీకే అరుణను కార్పొరేటర్ సువర్ణ సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. జిల్లా అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, కార్పొరేటర్ పిట్ల యాదయ్య, కిరణ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

టీయూడబ్ల్యూజే (హెచ్ 143) మండల కమిటీ ఎన్నిక

ఎన్నికైన టీయూడబ్ల్యూజే (హెచ్ 143) మండల కమిటీ

జడ్చర్ల, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : టీయూడబ్ల్యూజే (హెచ్ 143) మండల కమిటీని సోమవారం పట్టణంలోని అంబేడ్కర్ కళా భవన్‌లో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అమర్‌నాథ్‌గౌడ్, ప్రధాన కార్యదర్శిగా శ్రీకాంత్‌రెడ్డి, కోశాధికారిగా చెన్నయ్య (సురేశ్), ఉపాధ్యక్షులుగా మోయిన్, రఘు, సంయుక్త కార్యదర్శులుగా వేణు, సురేశ్, ప్రచార కార్యదర్శిగా కిరణ్, కార్య నిర్వహణ సభ్యులుగా అశోక్‌కుమార్, మహేష్‌కుమార్, నిస్సార్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా టీయూడబ్ల్యూజే (హెచ్ 143) సభ్యత్వాలను జిల్లా అడ్‌హక్ కమిటీ సభ్యులు శివకుమార్, చింతకాయల వెంకటేశ్, సభ్యులు రవికుమార్, నరేందర్‌గౌడ్ అందచేశారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం

» తలపై నుంచి లారీ టైర్ వెళ్లడంతో ఛిద్రం

మహబూబ్‌నగర్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : మోటార్ సైకిల్‌ను వెనక నుంచి వచ్చిన లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై వెనక కూర్చున్న మహిళ రోడ్డుపై పడటంతో ఆమె తలపై నుంచి టైర్ వెళ్లగా తల ఛిద్రమై అక్కడికక్కడే మృతి చెందింది. పోలీసుల వివరాల ప్రకారం.. దేవరకద్రకు చెందిన గుంతపల్లి కృష్ణ తన భార్య స్వాతి(26)తో కలిసి రాఖీకి పాలమూరుకు వచ్చారు. రాఖీ తరువాత సోమవారం తిరిగి బైక్‌పై ఊరికి బయలుదేరారు. ధర్మాపూర్ వద్ద వెనక నుంచి వేగంగా అతి జాగ్రత్తగా వచ్చిన లారీ డ్రైవర్ ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో ఇద్దరూ ఎగిరి కింద పడగా స్వాతి తలపై నుంచి లారీ టైర్ వెళ్లడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందగా, కృష్ణకు తీవ్రగాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న కృష్ణ బావమరిది వెంకటేశ్వర అక్కడికి చేరుకుని తన బావను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. పోలీసులు ఘటన స్థలికి చేరుకుని మృతదేహాన్ని జనరల్ ఆసుపత్రి మార్చురికి తరలించారు. మృతురాలు సోదరుడు వెంకటేశ్వర రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్‌ఐ విజయ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

మరో ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

మూసాపేట : 44వ జాతీయ రహదారి మూసాపేట లక్ష్మీదాబా సమీపంలో సోమవారం ద్విచక్రవాహనాన్ని లారీ ఢీకొట్టడంతో వ్యక్తి కాలికి తీవ్ర గాయాలు అయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. పెబ్బేర్ మండలం రంగాపూర్ (బిడ్జీ) గ్రామానికి చెందిన నరసింహ అనే వ్యక్తి ద్విచక్రవాహనంపై మహబూబ్‌నగర్ వైపు వెళ్తుండగా మూసాపేట వద్ద లారీ వెనక నుంచి వేగంగా ఢీ కొట్టింది. కుడికాలు విరిగిపోయి తీవ్రంగా గాయపడ్డాడు. ఢీ కొట్టిన లారీ డ్రైవర్ పారిపోతుండగా స్థానికులు పట్టుకుని లారీని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కాగా గాయపడిన వ్యక్తికి తీవ్ర రక్తస్రావం కావడంతో పరిస్థితి విషమంగా మారింది. చికిత్స నిమిత్తం జిల్లా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వేణు తెలిపారు.

ఉత్తమ సేవలందిస్తున్న ఉపాధ్యాయులకు సన్మానం

ఉపాధ్యాయ దంపతులను అభినందిస్తున్న పాఠశాల విద్యాశాఖ కమిషనర్ నవీన్‌నికోలస్

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : ఉత్తమ సేవలందిస్తున్న ఉపాధ్యాయ దంపతులను పాఠశాల విద్యాశాఖ కమిషనర్ నవీన్ నికోలస్ సోమవారం హైదరాబాద్‌లోని ఆయన చాంబర్‌లో సన్మానించారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని సద్దగుండు ప్రాంతంలో గల భౌతిక శాస్త్రం ఉపాధ్యాయుడు టీఎన్ శ్రీధర్ సొంత నిధులు రూ.12 లక్షలతో సైన్స్ ప్రయోగశాలను స్థాపించడంతో టీఎన్ శ్రీధర్, సతీమణి సురేఖను అభినందించారు.

వ్యాపార సంఘం వినాయక ఉత్సవ కమిటీ ఎన్నిక

మిడ్జిల్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : వ్యాపార సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే వినాయక ఉత్సవ కమిటీ అధ్యక్షుడిగా బరిగెల శ్రీనివాసులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ భవన్ వద్ద వ్యాపార సంఘం సభ్యులు సమావేశమై ఉత్సవ కమిటీని ఎన్నుకున్నారు. వ్యాపార సంఘం అధ్యక్షుడు గంజి కృష్ణ మాట్లాడుతూ వినాయక ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు సభ్యులంతా సమన్వయంతో కృషి చేయాలని కోరారు. ఉపాధ్యక్షులుగా భాస్కరాచారి, వెంకట్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, శంకర్, ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాసులు, కోశాధికారిగా శ్రీనివాసులు, సహాయ కోశాధికారిగా శ్రీకాంత్‌రెడ్డి ఎన్నికయ్యారు. కార్యదర్శులుగా ఆంజనేయులు, లాలు, నర్సింహులు, మల్లేష్, బసవరాజ్, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహకుడిగా రాజేశ్వర్, ప్రచార కార్యదర్శులుగా రవీంద్ర, శ్రీధర్, సలహాదారులుగా రమేష్, భాస్కరాచారి, విజయ్‌కుమార్, శేఖర్, నరసింహ, అశోక్, శేఖర్, కైలాస్, లక్ష్మణ్ ఎన్నికయ్యారు.

పదేళ్ల పింక్ పాలన కంటే.. వెయ్యిరోజుల ప్రజాపాలన భేష్

» ప్రజాభిమానాన్ని పొందిన సీఎం రేవంత్‌రెడ్డి: పొంగులేటి

కేసముద్రం బహిరంగ సభలో వృద్ధురాలిని ముద్దాడుతున్న పొంగులేటి

కేసముద్రం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): "పదేళ్ల పింక్ పార్టీ పాలన కంటే వెయ్యిరోజుల ప్రజాపాలన అందిస్తున్న కాంగ్రెస్ పాలన భేష్. ఈ విషయాన్ని రాష్ట్రంలోని ఏ ఇంటికి వెళ్లినా, ఏ ఆడబిడ్డను, ఏ రైతును అడిగినా చెబుతారు" అని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం మహబూబాబాద్ జిల్లా కేసముద్రంలో అభివృద్ధి పనులను ప్రారంభించిన అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో మంత్రి మాట్లాడారు. "వెయ్యిరోజుల ప్రభుత్వం ఏం చేసిందంటూ రేపో మాపో ఆ పింక్ కలరోళ్లు ఏదో కార్యక్రమం చేపడుతున్నారట! వాళ్లకు కళ్లుండి కనబడడం లేదా? చెవులుండి వినబడడంలేదా?" అని బీఆర్ఎస్ నేతలనుద్దేశించి మంత్రి పొంగులేటి వ్యాఖ్యానించారు. వెయ్యిరోజుల పాలనలో అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజాభిమానం పొందారని తెలిపారు.

ప్రజల ఆశీస్సులకు అనుగుణంగా పాలన: తుమ్మల

ఖమ్మం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాష్ట్ర ప్రజల ఆశీస్సులకు అనుగుణంగా రేవంత్‌రెడ్డి సారథ్యంలోని ప్రజాప్రభుత్వ పాలన సాగుతోందని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఈ వెయ్యి రోజుల్లో ఒక్కో సమస్యను పరిష్కరించుకుంటూ రాష్ట్రాన్ని అభివృద్ధిపథంలోకి తీసుకెళ్తున్నామని చెప్పారు. వ్యవసాయ శాఖ మంత్రిగా తాను సీఎం రేవంత్‌రెడ్డికి మంచి పేరు తెచ్చేలా పనిచేస్తున్నానని, రైతులు, రైతు కూలీల సంక్షేమానికి కృషిచేస్తున్నానని తెలిపారు. ఖమ్మం నగరంలో సోమవారంపర్యటించిన ఆయన.. ప్రకాష్‌నగర్‌లో రూ.12 కోట్లతో చేపట్టే రహదారి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం జరిగిన సభలో మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలు సీఎం రేవంత్‌రెడ్డిని ఆశీర్వదించడంతో ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని చెప్పారు. అన్నివర్గాలకు న్యాయం చేయాలనే తపనతో సీఎం పనిచేస్తున్నారని కితాబిచ్చారు. సీఎం ఆలోచనలకు అనుగుణంగా రైతుల సంక్షేమానికి తాను కృషిచేస్తున్నానన్నారు.

'ఇన్వెస్ట్ తెలంగాణ' సదస్సు నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు : డిప్యూటీ సీఎం భట్టి

హైదరాబాద్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2026'ను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించడానికి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశించారు. డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో జరిగే ఈ సదస్సు ఏర్పాట్లపై సోమవారం ఆయన ప్రజాభవన్‌లో సమీక్ష నిర్వహించారు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు తదితరులు పాల్గొన్నారు. సదస్సుకు సంబంధించి ప్రతి అంశాన్ని సమీక్షించి, నిర్ణయాలు వేగంగా తీసుకునేలా ప్రజాభవన్‌లో ప్రత్యేకంగా వార్‌రూమ్‌ను ఏర్పాటు చేయాలని భట్టి సూచించారు. సదస్సు నిర్వహణకు కమిటీలను ఏర్పాటు చేసి, సీనియర్ ఐఏఎస్ అధికారులకు బాధ్యతలు అప్పగించాలని సూచించారు. సదస్సుకు ప్రత్యేకమైన లోగోను రూపొందించాలన్నారు. అక్టోబర్ మొదటి లేదా రెండో వారంలో ఢిల్లీలో కర్టెన్‌రైజర్ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని చెప్పారు.

మూడు ఆస్పత్రులకు నేను సూచించిన పేర్లే

» సీఎం ప్రకటనపై మంత్రి కోమటిరెడ్డి హర్షం

అల్వాల్, ఎల్బీనగర్‌లలో నిర్మించే టిమ్స్, వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులకు... తాను సూచించిన పేర్లనే పెడతామని అంబర్‌పేటలో జరిగిన సభలో సీఎం ప్రకటించడంపై మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. అల్వాల్ టిమ్స్‌కు టి.అంజయ్య, ఎల్బీనగర్ టిమ్స్‌కు కొండా లక్ష్మణ్ బాపూజీ, వరంగల్ సూపర్ స్పెషాలిటీకి ప్రొఫెసర్ జయశంకర్ పేరు పెట్టాలని.. తాను సనత్‌నగర్ టిమ్స్ ప్రారంభోత్సవం రోజు సీఎం రేవంత్‌ను కోరానని మంత్రి తెలిపారు. తన విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించినందుకు ఆయన కృతజ్ఞతలు చెప్పారు.

జాతీయ సదస్సులో తెలంగాణ జలభద్రత నమూనా

» దేశానికి దిశానిర్దేశం చేసేలా రాష్ట్ర విధానం: మంత్రి ఉత్తమ్

హైదరాబాద్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): సుస్థిర జలవనరుల నిర్వహణపై కేంద్ర జలశక్తి శాఖ సెప్టెంబరు 1, 2 తేదీల్లో న్యూఢిల్లీలో నిర్వహించనున్న జాతీయ సదస్సులో తెలంగాణ తన 'సమగ్ర జలభద్రత నమూనా'ను దేశం ముందుంచనుందని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. సచివాలయంలో శాఖ ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ సదస్సులో ఇవ్వాల్సిన ప్రజెంటేషన్, జలసంరక్షణ కార్యక్రమాలు వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. జలవనరుల సంరక్షణ నుంచి సురక్షిత తాగునీటి సరఫరా వరకు పలు అంశాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయం సాధిస్తూ, నిర్దిష్ట కాలపరిమితితో కూడిన జాతీయ కార్యాచరణ ప్రణాళికను రూపొందించేందుకు ఈ సదస్సు దోహదపడుతుందని మంత్రి తెలిపారు.

బీఆర్ఎస్‌ది నిరసన రాజకీయం: మంత్రి పొన్నం

హైదరాబాద్, అక్కన్నపేట, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): రాజకీయ ప్రయోజనాల కోసమే ప్రజా ప్రభుత్వంపై బీఆర్ఎస్ నిరసనలకు పిలుపునిచ్చిందని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆరోపించారు. సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం చాపగాని తండాలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల ప్రజా పాలనలో సాధించిన విజయాలను చూసి బీఆర్ఎస్ నేతలు తట్టుకోలేకపోతున్నారని విమర్శించారు. పదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని పూర్తిగా అప్పులపాలు చేసిన బీఆర్ఎస్‌కు నిరసన తెలిపే నైతిక హక్కు లేదన్నారు. కాంగ్రెస్ ప్రజాపాలనలో 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఉచిత బస్సు, రేషన్ కార్డులు, 72వేల ఉద్యోగాలు ఇచ్చామని, మహిళలను బస్సులకు యజమానులుగా చేశామని పేర్కొన్నారు.

జపాన్ భాష నేర్చుకుంటే ఉద్యోగావకాశాలు: వివేక్

జపాన్‌లో పని చేస్తున్న తెలంగాణ నర్సులతో మంత్రి వివేక్ వెంకటస్వామి భేటీ అయ్యారు. టామ్‌కామ్(తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ) బృందంతో కలిసి టోక్యో వెళ్లిన మంత్రి... జపాన్‌లో నర్సులు పని చేసే పరిస్థితులు, ఉద్యోగ సంబంధిత అంశాల గురించి అడిగి తెలుసుకున్నారు. రెండేళ్ల క్రితం టామ్‌కామ్ ద్వారా జపాన్‌కు వెళ్లిన తొలి బ్యాచ్ నర్సులు... తమ పని వాతావరణం, ఉద్యోగాలపై ఈ సందర్భంగా సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రస్తుతం 30 మంది తెలంగాణ నర్సులు జపాన్‌లో పని చేస్తున్నారని చెప్పారు. జపాన్ భాష నేర్చుకున్న నర్సులకు అక్కడ భారీగా ఉద్యోగావకాశాలు ఉన్నాయని మంత్రి తెలిపారు.

471 ఎంఎల్‌డీ మురుగునీటి శుద్ధికి 22 ఎస్టీపీలు

» నిర్మాణ, నిర్వహణ బాధ్యతలు 'రాఘవ సీవరేజ్' సంస్థకు..

కోర్ అర్బన్ రీజియన్ పరిధిలో మురుగునీటి శుద్ధి సామర్థ్యాన్ని భారీగా పెంచేందుకు 22 సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ల(ఎస్టీపీ) నిర్మాణం, నిర్వహణపై రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రూ.1906.44 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన ఈ ప్రాజెక్టులో మొత్తం 471.50 ఎంఎల్‌డీ సామర్థ్యంతో 22 ఎస్టీపీలను నిర్మించనున్నారు. జీహెచ్‌ఎంసీ పరిధి నుంచి ఓఆర్ఆర్ వరకు ఉన్న అన్ని మున్సిపాలిటీలను కవర్ చేస్తూ తలపెట్టిన ప్రాజెక్టు నిర్మాణ పనులను బీవీఎస్ఆర్-ఎస్‌జీఎస్-ఆర్‌సీపీఎల్ (జేవీ)కి అప్పగిస్తూ సోమవారం జీవో జారీ చేసింది. ప్రాజెక్టు కోసం రాఘవ సీవరేజ్ ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో ఎస్పీవీని ఏర్పాటు చేసి ప్రభుత్వంతో ఒప్పందం చేసుకుంది.

టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి-నిర్మల దంపతుల కుమారుడు దత్తుసాయిరెడ్డితో రమేశ్ పటేల్ - మాయ పటేల్ దంపతుల కుమార్తె పాలక్ పటేల్ నిశ్చితార్థం సోమవారం రాత్రి రంగారెడ్డి జిల్లా వట్టినాగులపల్లిలోని ఇవంతర కన్వెన్షన్‌లో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి' సంస్థల మేనేజింగ్ డైరెక్టర్ వేమూరి రాధాకృష్ణ.. కాబోయే దంపతులను ఆశీర్వదించారు.



కేసీఆర్ రాజీనామా చెయ్!

(మొదటిపేజీ తరువాయి)

అంబర్‌పేట సభలో జీహెచ్‌ఎంసీ నూతన లోగోను ఆవిష్కరిస్తున్న సీఎం రేవంత్

వంతెనను ప్రారంభించారు. ఈ సందర్భంగా అంబర్‌పేట వద్ద జరిగిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి మాట్లాడారు. వెయ్యి రోజుల ప్రభుత్వ పాలనపై నిరసన కార్యక్రమాలు చేపడతామని బీఆర్ఎస్ ప్రకటించిందని ప్రస్తావించారు. రాష్ట్రాభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేయడం విఫలమైనట్టా? అని ప్రశ్నించారు. "వెయ్యి రోజుల్లో రూ.22.25 కోట్లు మెక్కినవ్... ఏనాడైనా పేదలు, ఆడబిడ్డలు, నిరుద్యోగులు, విద్యార్థులు, రైతులు, దళితులు, గిరిజనులు, ఆదివాసీల కోసం ఏమన్నా ఇచ్చావా దుర్మార్గుడా? నీ బంధువులు చనిపోతే దినాలకు పోతవు. నీ మనవడికి దెబ్బ తగిలితే దవాఖానకు చూడడానికి పోతవు. ప్రజల కోసం బయటకు రావా? ఇందుకోసమేనా కోట్ల రూపాయల జీతభత్యాలు ఇచ్చి తెలంగాణ నిన్ను సాకుతున్నది? పందికొక్కులా ప్రజల సొమ్ము మెక్కి ఫామ్ హౌస్‌లో పండుకుంటే అయిపోయిందా? వెయ్యి రోజులు మొఖం చాటేసిన ప్రతిపక్ష నేత దేశంలో ఎవడైనా ఉన్నడా?" అని ముఖ్యమంత్రి ప్రశ్నించారు. ఈ వెయ్యి రోజుల్లో తాను ఒక గంట సెలవు తీసుకోలేదని, కేసీఆర్ ఒక గంట సమయం కూడా వెచ్చించలేదని అన్నారు. ఎవరైనా ప్రభుత్వ ఉద్యోగి 365 రోజులు విధులకు రాకుంటే ఉద్యోగం నుంచి డిస్మిస్ చేస్తారని, మరి వెయ్యి రోజులు రాని కేసీఆర్‌ను ఏం చేయాలని ప్రశ్నించారు. కేసీఆర్ కుటుంబం ఐదుగురు తొమ్మిదిన్నర ఏళ్ల లక్ష కోట్లు దోచుకున్నారని, ఇప్పుడు వెయ్యి రోజుల్లో అప్పనంగా ప్రభుత్వం సొమ్ము మెక్కుతున్నారని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ భవన్‌లో కార్యకర్తల రక్తం తీసుకొని, ప్రయివేటు ఆసుపత్రులకు అమ్ముకున్నరు. ఇంతకంటే దుర్మార్గుడు ఉంటరా? అని ప్రశ్నించారు. "హరీశ్‌రావు పెట్రోల్ తీసుకొని, అగ్గిపెట్టె మర్చిపోయిన నాటకం చూసి రెచ్చిపోయి ఎల్బీ నగర్‌లో శ్రీకాంతాచారి కాల్చుకున్నడు. 1200 మంది పిల్లలను పొట్టన పెట్టుకున్నది నువ్వు కాదా?" అన్నారు. వెయ్యి రోజుల్లో ఒక్క గంట కూడా ప్రజలకు కేటాయించని ప్రతిపక్ష నాయకుడు తక్షణమే రాజీనామా చేయాలనే డిమాండ్‌తో మంగళవారం నుంచి ఆరో తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టాలని కాంగ్రెస్, అనుబంధ సంఘాలకు ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. ఏడో తేదీన అసెంబ్లీ మొదలవుతుందని, కేసీఆర్ ఇప్పటికైనా సభకు వచ్చి ప్రజల సమస్యల మీద మాట్లాడాలని సూచించారు. ఇప్పటివరకు అనేక కష్టాలు పడి వ్యవస్థను దారిలోకి తెచ్చానని, ఇప్పటి నుంచి ప్రయాణం సాఫీగా సాగుతుందని, ప్రజలంతా అండగా ఉండాలని కోరారు. కాళ్లు, చేతులు కూడదీసుకున్నామని, పాలన పట్టాలెక్కిందని, ఇక సాఫీగా నడిపిస్తానని చెప్పారు. ఏ రోజు కూడా తన కుటుంబం కోసం అధికారాన్ని దుర్వినియోగం చేసే ప్రసక్తే లేదన్నారు. తనను గుంపు మేస్త్రీ అని వెక్కిరిస్తున్నారని, తన గుంపు ప్రజలేనని, అందరూ కలిసి తనకు ఈ జిమ్మేదార్ ఇచ్చిండ్రని చెప్పారు. అమెరికాలో బాత్‌రూమ్‌లు కడిగి, అక్కడ బతకలేక వచ్చినాయన లాగా తాను కంపెనీల సీఈవోగా ప్రాజెక్టు చేసుకోవడం లేదని చెప్పారు. "కేసీఆర్ నేను, ముసలామె.. మాకు బుక్కెడు బువ్వ చాలని తెలంగాణ ప్రజలను నమ్మించి, తరువాత కొడుకు, బిడ్డ, అల్లుడు, సడ్డకుడి కొడుకు, దయాకర్‌రావు, మాధవరం కృష్ణారావు, దివాకర్‌రావులను పిలిచిండు. మందలెక్క జమ్మై మంది సొమ్ము తిన్నరు. నేను ఏమన్నా అట్ల చేసిననా? నాకు అవకాశం వస్తే బల్మూరి వెంకట్, అద్దంకి దయాకర్, హన్మంతన్న, అనిల్ కుమార్, నవీన్ యాదవ్‌లకు అవకాశం ఇచ్చా. వీళ్లంతా నాకు చుట్టాలా? కాంగ్రెస్ కోసం కష్టపడ్డరు. భట్టి విక్రమార్క, గడ్డం ప్రసాద్, దామోదర రాజనరసింహ, అడ్లూరి లక్ష్మణ్, వివేక్ వెంకటస్వామి, పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి, సీతక్క నా బంధువులా? కుటుంబ సభ్యులా? కేసీఆర్ ముఖ్యమంత్రి అయితే కేటీఆర్, హరీశ్‌రావు, దయాకర్‌రావు, కృష్ణారావు, సంతోష్‌రావు, కవితారావులకు పదవులు ఇచ్చిండు. బయటోళ్లకు అవకాశం ఇచ్చిండా?" అని ప్రశ్నించారు. మహిళలకు ఉచిత ప్రయాణం పెడితే ఆటో డ్రైవర్లను ఉసిగొల్పిన దుర్మార్గపు చరిత్ర బీఆర్ఎస్‌దని చెప్పారు. కేసీఆర్ ప్రభుత్వంలో కనీసం ఒక రేషన్ కార్డు ఇచ్చారా? అని ప్రశ్నించారు. కేసీఆర్ కుటుంబంలో ప్రతీ ఒక్కరికీ భారీ ఫామ్‌హౌస్‌లు ఉన్నాయని ప్రస్తావించారు. పేదోడికి ఇళ్లు కట్టాలని, బువ్వ పెట్టాలని ఒక్కరోజైనా ఆలోచన చేసినవా? అని ప్రశ్నించారు. సనత్‌నగర్ టిమ్స్‌కు మర్రి చెన్నారెడ్డి పేరు పెడితే ఆయన కాలి గోటికి సరిపోని వాళ్లు రాద్ధాంతం చేస్తున్నారని అన్నారు. అల్వాల్ టిమ్స్‌కు మాజీ ముఖ్యమంత్రి అంజయ్య పేరు, ఎల్బీనగర్ టిమ్స్‌కు కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు, వరంగల్ టిమ్స్‌కు జయశంకర్ పేరు పెడుతున్నట్లు ప్రకటించారు. సచివాలయం ఎదుట రాజీవ్‌గాంధీ తీసేస్తామంటున్న వాళ్లకు అదే ప్రాంతంలో సర్దార్ సర్వాయి పాపన్న, జ్యోతిరావు పూలె విగ్రహాలు పెట్టాలని ఆలోచన ఎందుకు రాలేదని ప్రశ్నించారు. మలి దశ ఉద్యమ తొలి అమరుడు శ్రీకాంతాచారి తల్లి శంకరమ్మను బీఆర్ఎస్ అనాథలా రోడ్డు మీద వేస్తే మహిళా కమిషన్ సభ్యురాలిగా నియమించామని, చాకలి ఐలమ్మ పేరును కోఠి మహిళా వర్సిటీకి పెట్టామని, ఆమె ముని మనువరాలిని మహిళా కమిషన్ సభ్యురాలిని చేశామని ప్రస్తావించారు. తాము ఏడాదికి రెండు లక్షల ఇళ్లు కడుతున్నామని, కేసీఆర్ పదేళ్లలో 20 లక్షల ఇళ్లు ఎందుకు కట్టలేక పోయారని అడిగారు. అంబర్‌పేటలో 10 ఎకరాల్లో ఇందిరమ్మ ఇళ్లు కట్టించి ఇస్తామని సీఎం ప్రకటించారు. బతుకమ్మ కుంటను కబ్జా పెట్టిన ఎడ్ల సుధాకర్‌రెడ్డి కేసీఆర్ కోసం హెలికాప్టర్‌తో పూల వర్షం కురిపించాడని, కేసీఆర్ అలాంటి వ్యక్తులను ప్రోత్సహిస్తారని చెప్పారు. రూ.16 వేల కోట్ల మిగులు, రూ.70 వేల కోట్ల అప్పుతో కొత్త రాష్ట్రం ఏర్పడితే దాన్ని రూ.8.11 లక్షల కోట్లకు పెంచిన ఘనత కేసీఆర్‌ది అన్నారు.

నేడు ఢిల్లీకి రేవంత్‌రెడ్డి

ఢిల్లీలోని కాన్‌స్టిట్యూషన్ క్లబ్ మావలంకర్ హాల్లో బుధవారం సాయంత్రం జరిగే వైఎస్ఆర్ అవార్డు ప్రదాన కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక విశిష్ట అతిథిగా హాజరు కానున్నారు. మాజీ ఎంపీ కేవీపీ రాంచందర్‌రావు ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమానికి ప్రత్యేక అతిథిగా ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే, విశిష్ట అతిథిగా జైరాం రమేష్, గౌరవ అతిథులుగా తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, టీపీసీసీ చీఫ్ మహేష్‌గౌడ్, మంత్రి శ్రీధర్‌బాబు హాజరు కానున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు మంగళవారం రేవంత్ ఢిల్లీకి బయలుదేరి వెళ్లనున్నట్లు తెలుస్తోంది.

ట్రై కార్పొరేషన్లకు కొత్త లోగోలు

నగరంలోని 3 మునిసిపల్ కార్పొరేషన్లకు కొత్త లోగోలు వచ్చాయి. అంబర్‌పేట సభలో సీఎం రేవంత్ వాటిని ఆవిష్కరించారు. ఆరున్నర నెలల క్రితం ఏర్పడిన జీహెచ్‌ఎంసీ, మల్కాజ్‌గిరి మునిసిపల్ కార్పొరేషన్ (ఎంఎంసీ), సైబరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్(సీఎంసీ)లకు పురపాలక శాఖ లోగోలు రూపొందించింది. ప్రత్యేక ఆకారంలో 'ఎం' అక్షరాన్ని రూపొందించారు.పచ్చని ఆకులు, నీటి బొట్టు ఆకారాలు.. పచ్చదనం, పర్యావరణం, మెరుగైన పారిశుధ్య నిర్వహణను ప్రతిబింబిస్తాయని అధికారులు తెలిపారు.

---

152 మీటర్ల ఎత్తుతో తుమ్మిడిహెట్టి!

(మొదటిపేజీ తరువాయి)

ముఖ్యమంత్రి లేఖ రాశారు. ఈ నేపథ్యంలోనే మంగళవారం ఢిల్లీలో మహారాష్ట్ర, తెలంగాణ నీటి పారుదల శాఖ కార్యదర్శులతో కేంద్ర జలవనరుల సంఘం(సీడబ్ల్యూసీ) కీలక సమావేశం జరుగుతోంది. 150 మీటర్ల ఎత్తుతోనే బ్యారేజీ నిర్మాణం కోసం తొలుత కసరత్తు జరిగింది. 152 మీటర్ల ఎత్తు కోసం పట్టుబట్టాలని అధికారులకు ఉన్నత స్థాయిలో ఆదేశాలు వచ్చాయి. దాంతో 152 మీటర్ల ఎత్తుతో కలిగే ముంపు, నీటి లభ్యత, ప్రయోజనాలపై సమగ్ర నివేదికను సిద్ధం చేశారు. ఒక బ్యారేజీ వార్ధాపై, మరొకటి వెన్‌గంగాపై కట్టాలని ప్రతిపాదించారు. వార్ధా బ్యారేజీని 60 గేట్లతో, వెన్‌గంగాను 77 గేట్లతో నిర్మాణం చేపట్టాలన్నది యోచన. 867 మీటర్ల పొడవున వార్ధా, 1113.5 మీటర్ల పొడవున వెన్‌గంగా బ్యారేజీల నిర్మాణం చేపట్టాలన్నది ఆలోచన. ఈ రెండు కూడా 150 మీటర్ల ఎత్తుతో నిర్మిస్తారు. నది ప్రవాహానికి అడ్డంగా లంబాకారంలో బ్యారేజీల నిర్మాణం చేపట్టాలన్నది ప్రతిపాదన. ఈ డిజైన్‌ను సీడబ్ల్యూసీతో సంప్రదింపులు జరిపి, సర్వేలో ప్రతిపాదించారు. ఈ మేరకు ప్రభుత్వానికి తుమ్మిడిహెట్టి ప్రాజెక్టుపై ప్రాథమిక సాధ్యాసాధ్యాల నివేదిక(పీఎఫ్ఆర్)ను ఆర్వీ అసోసియేట్స్ అందించింది. ఎటువంటి గ్రామాల ముంపు లేకుండా 150 మీటర్ల ఎత్తుతో బ్యారేజీలు కట్టవచ్చని గుర్తు చేసింది. తెలంగాణ, మహారాష్ట్రల్లోనూ గ్రామాల ముంపు ఉండబోదని ఆ నివేదికలో పేర్కొన్నారు. 150 మీటర్ల ఎత్తుతో కడితే 4,215 ఎకరాల నదీగర్భం, చాప్రాల ఎకో సెన్సిటివ్ జోన్‌కు చెందిన 943 ఎకరాలు ముంపునకు గురి అవుతాయి. అయితే, 1,018 ఎకరాలు సేకరిస్తే చాలని రాష్ట్ర ప్రభుత్వం చెబుతోంది. తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీని 148 మీటర్ల ఎత్తుతో కట్టుకోవడానికి 2016 మార్చి 8వ తేదీన మహారాష్ట్రతో ఒప్పందం కూడా జరిగింది. దీన్ని అప్పట్లో 165 టీఎంసీలతో ప్రతిపాదించారు. 2015 ఫిబ్రవరి 13న హైడ్రాలజీ అనుమతి కూడా లభించింది. ఇరిగేషన్ ప్లానింగ్, అంతరాష్ట్ర క్లియరెన్, సెంట్రల్ సాయిల్ అండ్ మెటీరియల్ రీసెర్చ్, సెంట్రల్ గ్రౌండ్ వాటర్ బోర్డు(భూగర్భ జలాలపై), నిర్మాణం కోసం వినియోగించే యంత్ర పరికరాలు, మినిస్ట్రీ ఆఫ్ అగ్రికల్చర్(పంటలపై) అనుమతులు వచ్చాయి. ఇక పర్యావరణ అనుమతి కోసం తెలంగాణలో 2011 ఏప్రిల్‌లో బహిరంగ విచారణ కూడా జరిగింది. మహారాష్ట్రలో మాత్రం ఈ పని పూర్తికాలేదు. పలు అనుమతులు ఇదివరకే ఉండటంతో ఢిల్లీలో జరిగే భేటీలో మహారాష్ట్రను అధికారుల స్థాయిలో ఒప్పించే పనిలో రాష్ట్ర ప్రభుత్వం పడింది. అధికారుల స్థాయిలో సమావేశం అనంతరం ముఖ్యమంత్రుల స్థాయిలో తదుపరి భేటీ ఉంటుందని తెలుస్తోంది. తొలుత మహారాష్ట్ర ముందు 152 మీటర్ల ఎత్తు ప్రతిపాదనను ఉంచి, కనీసం 150 మీటర్ల ఎత్తుతో అయినా ఒప్పించాలని ప్రభుత్వం పట్టుదలతో ఉంది. మంగళవారం జరిగే సమావేశానికి సహకరించడానికి సీఎంవో కూడా రంగంలోకి దిగింది. సీఎం కార్యాలయ కార్యదర్శి మాణిక్కరాజ్ కన్నన్, ప్రభుత్వ సలహాదారుఆదిత్యనాథ్ దాస్, నీటిపారుదల శాఖ కార్యదర్శి ఇ.శ్రీధర్‌తోపాటు కీలక అధికారులంతా భేటీలో పాల్గొంటున్నారు.

ఫ్యూచర్ సిటీలో నార్త్ ఈస్టర్న్ వర్సిటీ క్యాంపస్

(మొదటిపేజీ తరువాయి)

